ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
సోమవారం 10 ఆగస్టు 2026 | సంపుటి: 1 | సంచిక: 54 | పేజీలు 12 | వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఏదో ఒకరోజు అమిత్ షా
## సమాధానం చెప్పక తప్పదు
రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించక పోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

2





## మమత బెనర్జీ వాహనంపై దాడి
పోలీసుల ఎదురుగానే దాడి జరిగిందని బంగాల్ మాజీ సీఎం ఆగ్రహం

2

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ పరామర్శ

- వరంగల్ జిల్లా నల్లబెల్లికి వెళ్లిన బీఆర్ఎస్ అధినేత
- పెద్ది సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురైన కేసీఆర్
- జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తల నినాదాలు

### రూ.2.25 కోట్ల చెక్కు అందజేత



2

దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. నల్లబెల్లిలో నిర్వహించిన దశదిన కార్యక్రమానికి హాజరైన కేసీఆర్.. పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ది కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన కేసీఆర్.. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ తరపున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందించారు.బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని ఆయన స్వగృహానికి కేసీఆర్ వెళ్లారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

- వరంగల్, ఆగస్టు 9 (సింగిడి)

# వైభవంగా బోనాల జాతర
పాతబస్తీలో బోనాల పండుగ శోభ..
అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

2



హైదరాబాద్ పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ వార్షిక బోనాల బ్రహ్మోత్సవాలకు వేళ నగరంలో పండుగ శోభ సంతరించుకుంది. ఏటా ఆషాఢమాసంలో వైభవంగా జరిగే ఈ జాతర కోసం అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ అనంతరం దేవాలయం తరపున తొలి బోనం సమర్పించారు. ఉదయం 6:00 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

- హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)



అమరవీరుల కుటుంబాల కోసం
# ప్రత్యేక పోర్టల్
టీజీ-వీర్ ప్రారంభించిన డీజీపీ

2

రాష్ట్రంలో పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం టీజీ– వీర్ అనే యాప్ ను వరంగల్ లో ప్రారంభించామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కాజీపేట ఎన్ఐటీలో ఆదివారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులతో సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అప్పటి ప్రభుత్వాలు ఆదుకున్నాయని అన్నారు. ఇంకా మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకే ఈ టీజీ–వీర్ యాప్ పనిచేస్తుందన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో అధికారులు, అమరవీరుల కుటుంబాలు వారి సమస్యలను క్యూఆర్ కోడ్ ద్వారా ఈ యాప్ లో పెట్టవచ్చన్నారు.

- హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)

# సీజేఐకి నిరసన సెగ
నల్సార్ స్నాతకోత్సవానికి పిలవొద్దని విద్యార్థుల డిమాండ్



- 450 మంది విద్యార్థులు సంతకాలతో యాజమాన్యానికి లేఖ
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా
- డిమాండ్ నెరవేరకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

2

ASSEMBLY
# అసెంబ్లీ.. అగ్నిపరీక్ష

పరీక్షల సమయం వస్తే.. పనితీరు బయటపడినట్టుగా.. అసెంబ్లీ సమావేశాలపై రాజకీయ ఉత్కంఠ మొదలైంది. ఆగస్టు మూడో వారంలో శాసనసభ సమావేశాలు జరిగే అవకాశం ఉండటంతో.. అధికార, ప్రతిపక్షాల వ్యూహాలు పదునెక్కుతున్నాయి. యువత రాజకీయాల్లోకి రావడానికి 21 ఏళ్ల వయోపరిమితి కోరుతూ తీర్మానం.. హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్ బిల్లుపై సెలెక్ట్ కమిటీ పరిశీలన.. వంటి అంశాలు సభలో చర్చకు వచ్చే అవకాశముంది.

(హైదరాబాద్ బ్యూరో-సింగిడి)

## ఆగస్టు మూడో వారంలో అసెంబ్లీ భేటీకి అవకాశం

- ప్రభుత్వ బిల్లులు.. విపక్షాల ప్రశ్నలు
- హామీలు, నిధులు, ఉద్యోగాలపై నిలదీత
- ప్రజా సమస్యలపై ఎవరిది పోరాటం



### యువత.. ప్రజలు కోరుకునేది ఇదే
21 ఏళ్లకే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయాలన్న ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇది యువత రాజకీయ భాగస్వామ్యంపై పెద్ద చర్చకు దారితీసే అంశం. అయితే యువతకు రాజకీయ అవకాశాలతో పాటు ఉద్యోగాలు, విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, నైపుణ్యాభివృద్ధిపై కూడా స్పష్టమైన కార్యాచరణ కావాలన్నదే ప్రజల అసలు ఆకాంక్ష.

### ప్రజా సమస్యలే అసలు పరీక్ష
అసెంబ్లీ సమావేశాలు కేవలం బిల్లులు ఆమోదించే వేదికగా కాకుండా.. ప్రజా సమస్యలకు సమాధానాలు వెతికే వేదికగా నిలవాల్సిన అవసరం ఉంది. నీటి సమస్యలు, రైతుల సమస్యలు, ఉద్యోగాలు, విద్య, సంక్షేమ బకాయిలు, పట్టణ–గ్రామీణ మౌలిక వసతులు.. ఇలా ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలపై చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారు.

### ప్రభుత్వం ముందున్న బిల్లులు
ప్రభుత్వం ప్రవేశపెట్టే లేదా ముందుకు తీసుకెళ్లే బిల్లులపై సభలో చర్చ కీలకం కానుంది. ముఖ్యంగా హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్ బిల్లుపై ఇప్పటికే సెలెక్ట్ కమిటీ ఏర్పాటైంది. మున్సిపల్, పరిపాలనా, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ఇతర ప్రతిపాదనలు కూడా సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఖచ్చితమైన బిల్లుల జాబితా అధికారిక బిజినెస్ అడ్వైజరీ/అసెంబ్లీ బులెటిన్ వెలువడిన తర్వాతే స్పష్టమవుతుంది.

### విపక్షం.. ఏ అంశాలు లేవనెత్తుతుంది
బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రధానంగా ప్రజా సమస్యలనే అస్త్రాలుగా మలుచుకునే అవకాశం ఉంది. ఉద్యోగ నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, సంక్షేమ పథకాల అమలు, సాగునీరు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలు సభలో ప్రస్తావనకు వచ్చే అవకాశముంది. అధికార పక్షం గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తే.. విపక్షాలు ప్రస్తుత ప్రభుత్వ హామీలు, అమలుపై సమాధానాలు కోరే అవకాశం ఉంది.

### ఎవరి అడుగులు ముందుండబోతున్నాయి
అధికార పక్షం హామీల అమలుపై సమాధానం చెప్పాలి.. ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. అయితే అసెంబ్లీలో ఎవరు ఎక్కువగా మాట్లాడారన్నది కాదు.. ఎవరు ప్రజల గొంతును బలంగా వినిపించి.. పరిష్కార దిశగా అడుగు వేయించారన్నదే అసలు విషయం. రాజకీయ పోరుకు వేదికగా కాకుండా.. ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా అసెంబ్లీ నిలుస్తుందా అన్నదే ఈ సమావేశాల అసలు పరీక్ష.



## మెడికో ప్రియాంక కన్నుమూత

- రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్

2

ప్రియాంక కుటుంబానికి
## న్యాయం చేస్తాం
నిందితులను అరెస్ట్ చేశాం.. హోంమంత్రి అనిత

# సర్ ఎఫెక్ట్

- హైదరాబాద్‌లో భారీగా తగ్గనున్న ఓటర్ల సంఖ్య
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా




### నగరంలో 40 లక్షల ఓట్లు గల్లంతు?
### ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నేటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)

2



## బోనమెత్తిన బండి సంజయ్
హైదరాబాద్‌లో లాల్‌దర్వాజా బోనాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)

### బోనాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం
బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

2

ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన
# బ్రహ్మోస్ ప్రతిష్ఠ
ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్

- కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదన
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు

2




న్యూఢిల్లీ (సింగిడి)

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి.



## పెద్ది కుటుంబానికి కేసీఆర్ పరామర్శ

పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను కేసీఆర్ ఓదార్చారు. ఆ కుటుంబం కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని.. ఎలాంటి అవసరం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు, చదువులు, కుటుంబ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు కేసీఆర్ కుటుంబ సభ్యులకు రూ.2.25 కోట్ల చెక్కును అందజేశారు. ఇందులో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఇవ్వనున్నారు.

# సర్ ఎఫెక్ట్

వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేక పోర్టల్

వారి కోసమే దీన్ని వరంగల్ లో ప్రారంభించామని తెలిపారు. దీన్ని ఎస్ఐబి డిజైన్ చేసిందన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు సంబంధించి ఎక్స్ గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి సమస్యలను పెట్టవచ్చన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 28 మంది పోలీసు అమరవీరుల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారినందరిని ఆదుకుంటామని వివరించారు. వారితో కమిషనరేట్ లో కలిసి వివరాలు తెలుసుకున్నానన్నారు. మొదట చనిపోయిన కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా తక్కువ వచ్చిందని తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇంటి స్థలాల సమస్య ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం లేదని డీజీపీ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలు ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నాయన్నారు. మావోయిజం తగ్గిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 2010 నుంచే మావోయిస్టు ప్రభావం తగ్గిన పక్కనే ఉన్న ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్రలో కొంత ఉండేదన్నారు. అది కూడా ప్రస్తుతం తగ్గి పోయిందన్నారు. సెంట్రల్ కమిటీ నేతలు లొంగిపోవడం, కొంత మంది ఎన్కౌంటర్ కావడం వల్ల ప్రభావం తగ్గిందన్నారు. లొంగిపోయిన నక్సల్స్ కోసం మెరుగైన పునరావాసం కల్పించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే వారికి తగిన సహాయం అందించామన్నారు. వారు స్వస్తిగా నిలబడేందుకు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నేరాల ట్రెండ్ మారిందన్నారు. గంజాయి రవాణా ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో ఈగల్ ద్వారా గంజాయికి అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. వేరే ప్రాంతాల నుంచి రాష్ట్రానికి వస్తున్న కట్టడి చేస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు కూడా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ అందిస్తున్నారని అన్నారు.

సమాజంలో అందరూ డ్రగ్స్ ను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. వ్యాపారులు, చిరు ఉద్యోగులు అత్యాశకు పోయి మోసాలకు గురవుతున్నారని అన్నారు. డబ్బును చూపెట్టి సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని మోసపోయిన తర్వాత డబ్బులను తిరిగి తీసుకురావడం కష్టంగా ఉందని తెలిపారు. వీటిపైన అవగాహన తెచ్చుకొని మోసానికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్ నియంత్రణకు సరికొత్త బ్యూరోలను ఏర్పాటు చేసి పని చేస్తున్నామన్నారు. గ్రేహౌండ్స్ సిబ్బందిని కూడా ఈ బ్యూరోలకు మారుస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను తగ్గించేందుకు రోడ్ సేఫ్టీ కోసం ప్రత్యేక విభాగాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విభాగాన్ని మరింత పటిష్టం చేసి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో కల్తీ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఫుడ్ సేఫ్టీ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. టెక్నాలజీ పెరిగిన బేసిక్ పోలిసింగ్ ను మరువద్దన్నారు. సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. స్టేషన్ కు వచ్చే వారికి సహకారం అందించడంతో పాటు వారి సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టామన్నారు. కొన్ని చోట్ల తనిఖీ చేసే సమయంలో ట్రాఫిక్ సమస్య ఉంటుందన్నారు. దానికి ప్రజలు సహకరించాలన్నారు. పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోస్టింగ్ లు ఇస్తున్నామన్నారు. రాజకీయ పైరవీలకు తావివ్వడం లేదన్నారు. అవసరమున్న చోట వారి విజ్ఞప్తిని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. పోలీసులు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నారన్నారు. యువత ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్ మోసాలకు గురి కావద్దని తెలిపారు. పట్టణాల్లోనే ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం వాటిపై అవగాహన కల్పిస్తున్న ఇంకా అక్కడక్కడ కొనసాగుతున్నాయని తెలిపారు. వరంగల్ నుంచే తన వృత్తి జీవితం మొదలయ్యిందని అన్నారు. ఇక్కడే తాను పోలీసుస్టేషన్ శిక్షణ పొందన్నారు. మొదటి పోస్టింగ్ ఇక్కడే వరంగల్ రూరల్ ఏ ఎస్పీగా పని చేశానని తెలిపారు. అప్పుడు నక్సల్స్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. తాను జిల్లాను మారువలేనన్నారు. పోలీస్ కమిషనరేట్ లో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని డీజీపీ అధికారులతో కలిసి పరిశీలించారు. వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతన భవనం పూర్తయితే త్వరలోనే కార్యాలయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. ఈ విలేకరుల సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎం.శ్వేత, ఎస్పీలు రూపేష్, సాయిశ్రీ, గిరిధర్, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

# సీజేఐకి నిరసన సెగ

**హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)**

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి"




వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

## ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన బ్రహ్మోస్ ప్రతిష్ఠ

**న్యూఢిల్లీ (సింగిడి)**

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన ప్రతిష్ఠ**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది.

**పెరిగిన ఉత్పత్తి.. భవిష్యత్ ప్రణాళికలు**

పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**బ్రహ్మోస్ ప్రస్థానం**

బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది.

## ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9 (సింగిడి)**

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. అమిత్ షా ఏదో ఒకరోజు సమాధానం చెప్పక తప్పదన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పటానికి బదులు వారినే క్షమిస్తున్నానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి తనతో పంచుకున్న ఆవేదనను రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆదివారం పంచుకున్నారు.

ఉన్న భూమి అమ్మి, అదీ చాలక అప్పులు చేసి మరీ పరీక్షకు సిద్ధమైతే చివరికి దక్కిందేమీ లేదని బాధిత విద్యార్థి వాపోయినట్లు రాహుల్ చెప్పారు. ఇప్పుడు తనకు ఏదారీ కనిపించటం లేదని అతడు తనతో చెప్పినట్లు తెలిపారు. ఇది ఆ విద్యార్థి వైఫల్యం కాదని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వలేని ప్రస్తుత వ్యవస్థ వైఫల్యమని ఆయన విమర్శించారు. యువతే దేశానికి వెలుగు అని, వారికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

**'యువతకు ఐవైసి ఎప్పుడూ తోడుంటుంది'**

ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశపు గొప్ప బలం యువతేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, యువ భారతీయులకు తమ గళాలను, ఆందోళనలను వినిపించడానికి, తమ హక్కులు, కలలు, ఆకాంక్షల కోసం పోరాడటానికి ఒక వేదికను అందించడంలో ఐవైసికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఎక్స్‌లో ప్రస్తావించారు.

"ఐవైసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ సభ్యులందరికీ శుభాకాంక్షలు. భారతదేశపు అతిపెద్ద బలం దాని యువతే. యువ భారతీయులకు ఒక వేదికను అందించడంలో ఐవైసికి అద్భుతమైన చరిత్ర ఉంది. యువత తమ గొంతుకనను వినిపించడంలో, వారి సమస్యలను లేవనెత్తడంలో, వారికి వ్యతిరేకంగా రూపొందించిన వ్యవస్థతో పోరాడడంలో, ఐవైసి ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలుస్తుంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో శనివారం 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

**ఐవైసీని ఎప్పుడు స్థాపించారు?**

భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగమైన భారత యువజన కాంగ్రెస్ 1960 ఆగస్టు 9న స్థాపించారు. ఈ పార్టీ గతంలో కాంగ్రెస్ పార్టీలోనే ఒక భాగంగా ఉండేది. ఆ తర్వాత,అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దీనిని ఒక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, ఈ సంస్థలో రెండు కోట్లకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ సంస్థ 'శక్తి సూపర్ షీ' అనే ప్రచారంతో సహా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది0. అయితే, వీటి ప్రధాన లక్ష్యం కాంగ్రెస్ పార్టీతో మహిళల దేశవ్యాప్త అనుబంధాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందించడం, బలోపేతం చేయడం. ఇతర కార్యక్రమాల్లో భారత్ జోడో నాయకత్వ కార్యక్రమం, పెహ్లా ఓటు, ఇందిరా ఫెలోషిప్, యువత హక్కుల కోసం గళం విప్పడం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉదయ భాను చిబ్, కృష్ణ అల్లవారు ఈ సంస్థకు అధ్యక్షుడిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

**ఆదివాసీలే అసలైన యజమానులు**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం(ఆగస్టు 9) సందర్భంగా దేశంలోని ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ రాహుల్ గాంధీ ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీలే దేశపు అసలైన యజమానులని, వారి విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశానికి లభించిన అమూల్యమైన వారసత్వ సంపదగా ఆయన కొనియాడారు. భూమి, అటవీ సంపదపై వారికి ఉన్న హక్కులతో పాటు, వారి అస్తిత్వం ఆత్మగౌరవం కోసం సాగే పోరాటంలో వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

## మమత బెనర్జీ వాహనంపై దాడి

**కోల్‌కతా, ఆగస్టు 9 (సింగిడి)**

బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఆదివారం చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణా జిల్లాలో ఆమె కారుపై నిరసనకారులు రాళ్లు, బురద విసరడంతోపాటు, చోర్ (దొంగ), దొంగల రాణి అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటనపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

టీఎంసీకి చెందిన కార్యకర్త బిర్జు కియోట్. ఆయన కాంచరపారా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జెనీ శర్మ భర్త. దోపిడీ సహా పలు ఆరోపణలపై ఆయనను హాలిసహర్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఆయనను కోర్టులో హాజరుపరచగా, ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించారు. అయితే ఆయన కస్టడీలో ఉండగానే, అనారోగ్యానికి గురై చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే లాకప్‌లో తన భర్తను తీవ్రంగా కొట్టారని, పోలీసుల దాడి కారణంగానే అయన మరణించారని భార్య జెనీ శర్మ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి మమత వెళ్లారు. అయితే బిజ్‌పూర్ వద్ద నిరసనకారులు ఆమె కారును చుట్టుముట్టారు. ఆ సమయంలో కారులో మమతతో పాటు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా ఉన్నారు. అయితే నిరసనకారులు శాంతియుతంగా ఉన్న ఆ ప్రాంతంలో అశాంతిని సృష్టించేందుకే మమత వచ్చారని ఆరోపించారు. ఆమెకు వ్యతిరేకంగా దొంగ, దొంగల రాణి అంటూ నినాదాలు చేశారు. దీనితో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ సువేందు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పోలీసులపై తనకు ప్రత్యేకంగా కోపం లేదని మమతా బెనర్జీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. "పోలీసులు గూండాలను కాపాడుతున్నారు. బంగాల్ గూండాల చేతుల్లోకి వెళ్లిపోయింది. దీనిపై మా పార్టీ చట్టపరంగా ముందుకు వెళ్తుంది" అని చెప్పారు.

## వైభవంగా బోనాల జాతర

ప్రభుత్వం తరఫున ఉదయం 10:30 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉదయం నుంచి రాత్రి 10:30 గంటల వరకు భక్తులు బోనాలు, ఒడి బియ్యం, చీర, సారెను అమ్మవారికి నివేదించనుండగా, సాయంత్రం వేళ అమ్మవారి శాంతి కళ్యాణం వైభవంగా జరగనుంది. లాల్ దర్వాజాలోని ప్రధాన ఆలయంతో పాటు పరిసరాల్లోని దాదాపు 3,000 చిన్న దేవాలయాల్లో భక్తులు బోనాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాల్లో దాదాపు 5 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఆవరణ చిన్నది కావడంతో భక్తుల కోసం 6 ప్రత్యేక క్యూలైన్లను, బోనం తీసుకొచ్చే వారికి ప్రత్యేక మార్గాన్ని రూపొందించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లు, ఉచిత వైద్య శిబిరాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. ముందస్తు సమాచారం అందించిన జోగిణులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేశారు. ఇది సున్నితమైన ప్రాంతం కావడంతో 100 సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 2,500 మంది సిబ్బందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## మెడికో ప్రియాంక కన్నుమూత

ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్‌పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ప్రియాంక కుటుంబానికి న్యాయం చేస్తాం

వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీతో ఆమె ఫోన్‌లో మాట్లాడి దర్యాప్తు పురోగతి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం మంత్రి అనిత.. బాధితురాలు ప్రియాంక తండ్రి వెంకటేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించారని, నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని హోంమంత్రి పునరుద్ఘాటించారు.

# బోనాల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

**హైదరాబాద్, ఆగస్టు 9 (సింగిడి)**

బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పై తీవ్రవిమర్శలు చేశారు. హిందూ సమాజం, సనాతన ధర్మం విషయంలో ఆ రెండు పార్టీలు సంతుష్టీకరణ రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ మాత్రం సంతుష్టీకరణ రాజకీయాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు తగినన్ని నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో వేలాది ఆలయాలు ఉన్నప్పటికీ బోనాల ఉత్సవాలకు కేటాయిస్తున్న నిధుల పై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోల్చితే బోనాలకు ఎందుకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశ్నించారు.

**చరిత్రను వాస్తవ కోణంలో బోధించాలి..**

తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. చరిత్రను వాస్తవ కోణంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. టిప్పుసుల్తాన్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరి పై విమర్శలు చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడం పై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. హిందూ సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రశ్నిస్తే వాటికి మతం రంగు పులమడం సరికాదని అన్నారు. ఆలయాల పరిరక్షణ, గోరక్షణ, హిందువుల భద్రత వంటి అంశాలపై తాను నిరంతరం మాట్లాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ప్రతి ఏడాది బోనాల ఉత్సవాల్లో పాల్గొంటున్నానని, బోనాలకు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ స్వచ్ఛంద సంస్థ కాదని, ప్రజా సమస్యలపై పోరాడే రాజకీయ పార్టీ అని అన్నారు. హిందూ సమాజం మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**నిరుద్యోగం, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని నిలదీత..**

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. హైడ్రాలో కేవలం 150 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు సరూర్‌నగర్ స్టేడియం యువతతో నిండిపోవడం పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్న హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టిందని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ అన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. అర్హులైన వృద్ధుల నుంచి పింఛన్ దరఖాస్తులు ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నిస్తే వాటికి మతం రంగు పులమడం సరికాదని బండి సంజయ్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఒ నిజం
Singidi
సోమవారం 10-8-2026



# రోడ్డు పనుల్లో నాణ్యత కరువు

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు, పట్టించుకోని అధికారులు

**వికారాబాద్, ఆగస్టు 9(సింగిడి):** ప్రభుత్వం పనులంటే నాణ్యత లోపానికి పరాకాష్టగా మారాయి. రాజుల పైసలు రాళ్ళ పాలు అన్న ఛందంగా మారింది నిర్మాణాల పరిస్థితి. ప్రస్తుతం వికారాబాద్ మండల పరధి గంగారం నాగారం రోడ్డు పనులు కొనసాగు తున్నాయి. ఈ పనులపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో సంబంధిత అధికారులు నిర్దేశించిన మట్టిని కాకుండా నల్లమట్టి, పాత మట్టి వినియోగిస్తున్నారని స్థానికుల విచారం వ్యక్తం చేస్తున్నారు. పనులపై అధికారుల పర్యవేక్షణ లేదం టూ వారు అంటున్నారు. ఉన్నత అధికారులు స్పంధించి నాణ్యతపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ నుంచి గంగారం మీదుగా నాగారం వరకు కొనసాగుతున్న రోడ్డు పనుల నాణ్యతపై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా నాసి రకం మట్టి వినియోగిస్తున్నారని, పనులను సంబంధిత అధికారులు సక్రమంగా పర్యవేక్షించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. మొరం బదులు నల్లమట్టి రేగడి మట్టి రోడ్డు నిర్మాణంలో అడుగుభాగంలో ఫౌండేషన్ కోసం నాణ్యమైన మొరం వినియోగించాల్సి ఉండగా, నల్లమట్టిని ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఈ మట్టి కుంగిపోయి రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాత రోడ్డు మట్టినే తిరిగి వినియోగిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న బీటీ రోడ్డును తవ్విన తర్వాత వచ్చిన మట్టినే తిరిగి రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం జరుగుతోందని వారు విమర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని ఇలాంటి రోడ్డు పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతను నిర్ధారించాల్సి ఉండగా, తగిన స్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి రోడ్డు పనుల నాణ్యతపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉపయోగిస్తున్న మట్టి, నిర్మాణ సామగ్రి నాణ్యతను సాంకేతికంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మాకు నాణ్యమైన రోడ్డు కావాలని నాసిరకం రోడ్డు వద్దు అంటూ స్థానికులు స్పష్టం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించకపోతే రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో నిర్మిస్తున్న అంతర్గత సీ సీ రోడ్ల నిర్మాణం దారుణంగా ఉంటుందని ఆయా గ్రామాలకు చెందిన వారు చెబుతున్నారు. సీ సీ రోడ్డు నిర్మాణంలో ఇసుక, డస్ట్ సమపాలల్లో తగిన సిమెంట్ మిలితం చేసి రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉండగా నమూనాకోసం ఇసుకను పని స్థలంలో పోసి నామమాత్రంగా కలుపుతూ 80 శాతం డస్ట్ పోసి రోడ్లు నిర్మిస్తున్నారని ఇది జగమెరిగిన సత్యమని పరిశీలకులు భావిస్తు న్నారు. పనిప్రదేశంలో అధికారుల జాడకుండా ఉండదని సంబంధిం చిన ప్రజా ప్రతినిధి ఛాయాలకు కూడా రారని అంటున్నారు. ఈ పరి స్థితిలో రోడ్డు నిర్మాణంలో నాణ్యత కోసం వెతకడం ఎండమామిలో నీటిచమ్మ కోసం వెతికినట్లుగా ఉంటుందని అంటున్నారు. ఈ విష యాన్ని చాలెంజ్‌గా తీసుకుంటే నాణ్యత ప్రమాణాలపై క్షేత్రస్థాయి పరీక్షలకు సిద్ధమేనని పలువురు అంటున్నారు. గతంలో నిర్మాణాలు చరిత్ర పుటల్లో నిలిచాయని నేటి నిర్మాణాలు సంవత్సరాలు కూడా మనుగడ సాగించడం లేదని అంటున్నారు. ఇకనుండైనా నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిబద్ధతను చాటాలని పలువురు కోరుతున్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మున్సిపల్ కో కన్వీనర్





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 9 (సింగిడి):** బోనాల పండుగ వేడుకల సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కో కన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, ఓబీసీ మోర్చా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు జె.కె. శేఖర్ యాదవ్, యువనాయకులు ఆర్థిక్ యాదవ్, షిరిడి హిల్స్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ నాయక్, పండరీ యాదవ్, వినోద్ యాదవ్, ప్రభాకర్, సురేందర్, మహేష్, నరేందర్ పాల్గొన్నారు.

## గణితశాస్త్రంలో హరితకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, ఆగస్టు 09 (సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని దాదా హరిత డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సాధారణీకరించిన మెట్రిక్ ప్రదేశాలలో స్థిర బిందు సిద్ధాంతం, దాని అనువర్తనాలపై ఒక అధ్యయనం' చేసి, ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి, సహ-మార్గదర్శి డాక్టర్ కె.రామకోటేశ్వరరావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, సంక్లిష్టమైన గణిత సమ్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించే గణితశాస్త్రంలోని ఒక ముఖ్యమైన శాఖ అయిన ఫిక్స్ డ్ పాయింట్ థియరీ రంగానికి ముఖ్యమైన తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ఈ పరిశోధన, జనరలైజ్డ్ మెట్రిక్ స్పేసెస్ లో ఇప్పటికే ఉన్న పరిజ్ఞానాన్ని బలపరిచే, భవిష్యత్తు పరిశోధనలకు పటిష్టమైన పునాదిని వేసే అనేక నూతన సైద్ధాంతిక ఫలితాలను అందిస్తుందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు పరిశోధకులకు ప్రయోజనం చేకూర్చి, గణితం, సైన్స్, ఇంజనీరింగ్ లో మరింత పురోగతిని ప్రోత్సహిస్తాయని ఆశిస్తున్నట్టు తెలియ జేశారు. డాక్టర్ హరిత సిద్ధాంత వ్యాసం పీహెచ్. డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్ అభినందించారు.

# దారి ఇలా-వెళ్ళేదెలా?

### రోడ్డు వేయించాలని విద్యార్థుల వేడుకోలు



**కొడంగల్, ఆగస్టు 08(సింగిడి):** బొంరాస్ పేట్ మండలంలోని తుంకిమెట్ల గ్రామ పంచాయతీకి చెందిన కొన్ని కుటుంబాలు ఏళ్ళనాటి నుండి తమ వ్యవసాయ పొలాల్లోనే నివాసం ఏర్పరుచుకుని జీవనం కొనసాగి స్తున్నారు. ఊరి నుంచి వారి పొలాలకు 1.5 కిలోమీటరు దూరం ఉంటుంది. తాతల నాడు ముగ్గురు నివాసాలు ఏర్పరుచుకోగా ఇప్పుడు ఆ సంఖ్య ముప్పై కుటుంబాలకు చేరింది. నివాసం ఏర్పరచుకున్న ఆ ప్రాంతాన్ని ఇప్పుడిప్పుడు బంగారు పల్లెగా పిలుచుకుంటున్నారు. ఆప్రాంతానికి బంగారు పల్లెగా రికార్డు కావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ గత ప్రభుత్వం లో తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంక్ కట్టించారు. అన్ని కుటుంబాలు కలిసి శివకుమార్ అనే యువకుడి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి గుడి కూడా కట్టించారు. అక్కడ అందరూ కూడా వ్యవసాయం, కూలీనాలీ చేసుకుని పొట్టపోషించుకుంటారు. తుంకిమెట్ల-కోస్గి రోడ్డు నుండి వారి నివాసాల వరకు కిలోమీటరు దూరం మట్టి తొవ్వలో ద్విచక్ర వాహనాలపై, కాలినడ ద్వారా తుంకిమెట్ల గ్రామానికి నిత్యవసర పనుల మీద రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాలినడక వెళ్ళే మట్టి రోడ్డు గుంతలు పడడంతో వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో తొవ్వ మొత్తం బురదమయంగా ఉండడంతో ఒక్కోసారి కాలుజారితే శరీరమంతా బురదమయం కావాల్సిందే ననీ, ఒక్కసారి ద్విచక్ర వాహన దారులు కూడా కింద పడి బురద అంటించుకోవాల్సిందే అంటూ వాపోతున్నారు.

**ఇలా ఎన్నిరోజులు..**

కొడంగల్ నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలకు రోడ్డు పనులు జరుగుతున్నాయనీ, కానీ మావైపు ఎవరూ చూడడం లేదని ప్రాంతానికి చెందిన శివకుమార్ అనే యువకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ముప్పై కుటుంబాల సభ్యులు రోడ్డు లేక ఏళ్ళనాటి నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రతినిత్యం నిత్యవసర పనుల మీద తుంకిమెట్ల కు వెళ్ళాల్సిందేనని, సాయంత్రం వచ్చేటప్పుడు చీకటి సమయంలో మరీ ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయించి, రోడ్డు వెంబడి వీధి లైట్లు మంజుల చేస్తే ముఖ్యమంత్రి కి ఋణపడి ఉంటామంటున్నారు.

**పాఠశాలకు వెళ్ళాలంటే-బురద అంటాల్సిందే : విద్యార్థులు**

ఆప్రాంతంలో ఉండే చిన్న పిల్లలు చదువు కోడానికి తుంకిమెట్ల గ్రామానికి కాలినడక వెళ్తుంటారు. వర్షాకాలంలో తొవ్వ మొత్తం గుంతలు పడడంతో నీరు మలిచి దారంతా బురదమయం అవుతుందనీ, ఒక్కోసారి కాలు జారి బురదలో పడుతున్నామని, పాఠశాల కు వెళ్ళేందుకు ఆలస్యం అవుతుందనీ, ఆటంకం కలుగుతుందనీ, ప్రభుత్వం స్పందించి మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు వేస్తున్నారనీ, మాకు ఏళ్ళ తరబడి రోడ్డు సౌకర్యం కలగడం లేదని, ముఖ్యమంత్రి చొరవ తీసుకుని మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని చిన్నారుల నోట వినబడుతుంది.



## బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 9 (సింగిడి):** బోనాల పండుగ వేడుకల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట, సంజయపురి కాలనీ, అంజయ్య నగర్, సోమయ్య నగర్ ప్రభుత్వ పాఠశాల, ఫతేనగర్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కో కన్వీనర్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 42వ సారి రక్తదానం చేసిన నరేందర్ బాబు




**రాజేంద్రనగర్ , ఆగస్టు 9 (సింగిడి):** జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి కిస్మత్‌పూర్‌లోని గిరిధారి అవిఘ్న అపార్ట్‌మెంట్‌లో 'లెట్స్ హెల్ప్ సంవన్' ఎన్జీవో ఆధ్వర్యంలో ఆదివారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండ్లగూడ జగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షకోట్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ బాబు మాట్లాడుతూ, సమాజంలో రక్తం లేక ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటం మన అందరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 నుండి 45 రోజులకు ఒకసారి రక్తం మార్చాల్సి ఉంటుందని, అలాంటి వారి ప్రాణాలు నిలపాలంటే రక్తదాతలు నిరంతరం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేందర్ బాబు స్వయంగా 42వ సారి రక్తదానం చేసి యువతకు, కాలనీ వాసులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన చొరవను పలువురు అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో అపార్ట్‌మెంట్ వాసులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు నికిత, రమీజ్, జయసింహా రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా బోనాల ఊరేగింపు

- శివసత్తులతో డప్పుల దరురులతో మార్మోగిన గ్రామాలు



**వికారాబాద్, ఆగస్టు 9(సింగిడి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన, ప్రత్యేకమైన పండుగ బోనాలు. ఆషాడమాసంలో మొదట గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయంలో ప్రారంభమవుతాయి. తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో జరుగుతుంది. ఈ రెండు చోట్ల బోనాల పండుగ అంగరంగవైభవంగా జరిగింది. ఇక ఆగస్టు 9 వతేదీ ఆదివారం హైదరాబాద్ లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో ఈ బోనాల పండుగ ఉత్సవాలు జరుగుతాయి. హైదరాబాద్ లో బోనాల ఉత్సవాలు అదేరోజుగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లాలోని ఆయా గ్రామాల్లో వాడ వాడ లో భూనాలు ఊరేగాయి. డప్పుల దరువులతో, శివ సత్తులతో, పోతారాజుల విన్యాసాలతో బోనాల పండగను జిల్లా ప్రజలు ఆస్వాదించారు. బోనం అంటే భోజనం అని అర్థం. అమ్మవారికి భక్తిప్ర పత్తులతో, ప్రేమాప్యాయతలతో సమర్పించే నైవేద్యమే బోనం. కొత్త మట్టికుండలో లేదా ఇత్తడి పాత్రలోగానీ వండిన అన్నం, పాలు, బెల్లం కలిపి తయారుచేసిన ప్రసాదాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించిన కుండలో ఉంచుతారు. కుండపై వేపాకులు, అలాగే పైన పసుపు రాసిన మరో చిన్నకుండ, అందులో నూనెపోసి దీపంవొత్తి పెట్టి దీపం వెలిగిస్తారు. అలా దీపం వెలుగుతూ ఉండగా ఆ బోనం కుండను తలపై పెట్టుకుని మహిళలు అమ్మవారి ఆలయానికి తీసుకుని వెళ్తారు. ఈ దృశ్యం భక్తిపరవశంతో, తెలంగాణ సంస్కృతీ సంప్ర దాయాలకు ప్రతీకగా నిలచింది. అమ్మవారికి బోనం సమర్పించడం వెనుక తమను కాపాడుతూ రక్షణగా నిలుస్తున్నందుకు కృతజ్ఞత కోరే భక్తిభావం దాగి ఉంటుంది. ఎవరికి ఏ కష్టాలు రాకుండా, ఆపదలు సంభవించకుండా తమ కుటుంబాన్ని, తమ గ్రామాన్ని, పట్టణాన్ని, నగరాన్ని, దేశాన్నీ చల్లగా కాపాడమని అమ్మవారిని వేడుకుంటూ , భక్తులు మొక్కులు చెల్లిస్తూ బోనం సమర్పించారు. ఈ భక్తివేడుక ఎంతో నేత్రపర్వంగా సాగాయి. బోనం సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. డప్పుల శబ్దాలు, పోతురాజుల నృత్యాలు, రంగురంగుల ఊరేగింపులు, భక్తుల జయ జయధ్వానాలతో బోనాల ఉత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మికత అడుగడుగునా ఉట్టిపడేలా జరిగాయి. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అనే విశ్వాసం ప్రతిభక్తుడి హృదయంలో అణువణువునా నిండి ఉంటుంది. దయగల దేవత, కరుణించే తల్లి అయిన అమ్మవారి కృపాకటాక్ష వీక్షణలు మనందరి మీద ఉండాలని ప్రార్తించారు.

## ఆదివాసీల హక్కులను హరిస్తున్న
# ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలి



**వికారాబాద్, ఆగస్టు 9(సింగిడి):** ఆదివాసీల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం విధానలను అడ్డుకోవాలని, 1/70, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యులు మల్లన్నలు అన్నారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డీ జిల్లా జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణం తెలంగాణ ప్రజా ఫ్రంట్ వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యులు మల్లన్న, వికారాబాద్ జిల్లా, చెంచుగూడేం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, భూమి, అడవి, జీవనాధారాల పరిరక్షణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన ప్రత్యేక రక్షణలు ఉన్నప్పటికీ, నేటికీ వారి భూములు, అడవులు, సహజ వనరులపై దోపిడీ కొనసాగు తుండటం ఆందోళనకరమని అన్నారు. మైనింగ్, పరిశ్రమలు, ప్రాజెక్టులు, రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఆదివాసీలను వారి నివాస ప్రాంతాల నుంచి తరలించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల ఉనికినే దెబ్బతీసే విధానాలను అభివృద్ధిగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఆదివాసీల భూములకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అక్రమంగా బదలాయించిన గిరిజన భూములను తిరిగి ఆదివాసీలకే అప్పగించాలని కోరింది. అలాగే అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం సాగు భూములు, నివాస హక్కులు, సామూహిక అటవీ హక్కులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీలను ఆక్రమణ దారులుగా చిత్రీకరించడం సరికాదని, అడవిని కాపాడుతూ జీవిస్తున్న వారికే అటవీపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పి ఈ ఎస్ ఏ చట్టం ప్రకారం గ్రామసభలకు ఉన్న అధికారాలను పూర్తిస్థాయిలో అమలు చేసి, ఆదివాసీ ప్రాంతాల్లో భూమి, నీరు, అడవి, ఖనిజ వనరులపై నిర్ణయాలు తీసుకునే ముందు స్థానిక గ్రామసభల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి, రహదారులు, గృహ వసతులు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ తగిన స్థాయిలో లేవని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, హైదరాబాద్ ఉమ్మడి రంగారెడ్డీ జిల్లా కమిటీ సభ్యులు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు నాయకులు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ వికారాబాద్ జిల్లా కోశాధికారి మల్లన్న, జీ, మల్లయ్య, చందర్, రాములు, వెంకటయ్య , ఎల్లయ్య, గోరయ్య, బి. వెంకటయ్య, రాజ్కుమార్, సురేష్, క్రిష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
10 ఆగస్టు 2026

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వాలు.

**ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలు కోసం ఎంసిపిఐ(యు) పోరాటాలు.**




**కామారెడ్డి రూరల్, (డ** ప్రజా సమస్యలు పరిష్కరిం చడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఎంసిపిఐ(యు) పొలిటిక ల్ సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా లో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నా రు. దీర్ఘకాలిక ఇంటి పట్టాల సమస్య, ఇంటి నెంబర్ల సమస్య, ఇళ్ల స్థలాల సమస్య, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రజలను నిలదీసే ఉద్యమాలు లేకనే సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతంగా బిజెపి పాలన ఉందని ఆరోపించారు. దేశంలో ప్రజల సొమ్మును ఆదాని, అంబానీలకు కూడబెట్టడమే బిజెపి పాలన అని, లక్షల కోట్ల అప్పులు పెట్టి పేదరికాన్ని పెంచుతున్నారని అన్నారు. మతోన్మాద, మనువాద విధానాలతో ప్రజల ఆలోచనను మారుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఎంసిపిఐ(యు) తగిన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ సభ్యులు అంతంపల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, సుజాత, రఘుపతి, లింగం, భాగ్య, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్ల ఆశీస్సులతో..దేవునిపల్లిలో ఆధ్యాత్మిక సందడి!

**ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ.**
**పాడిపంటలు సమృద్ధిగా పండాలి. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: కౌన్సిలర్ దుంపల మంజుల శంకర్.**



**కామారెడ్డి రూరల్, (సింగిడి):** ఎల్లారెడ్డి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలో గల దేవునిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మంజుల శంకర్ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దుంపల మంజుల శంకర్ మాట్లాడుతూ అమ్మవార్ల కరుణాకటాక్షాలతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో తులతూగాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో కలిసి డప్పు వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యంతో ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో దేవునిపల్లిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. అమ్మవార్ల నామస్మరణ, డప్పు వాయిద్యాలతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

## కామారెడ్డిలో విషాదం..చదువుపై విరక్తితో విద్యార్థి బలవన్మరణం.




**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రంలోనిఎంత చదివినా బుర్రకెక్కడం లేదని. చదువులో వెనుకంజలో ఉంటుండడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పాల్వంచ మండలంలో చోటు చేసుకుంది.

తొమ్మిదో తరగతి విద్యార్థి..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన దొరబోయిన జశ్వంత్ (15) గ్రామంలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే ఎంత చదివినా అతనికి చదువు అబ్బడం లేదని ఎప్పుడూ బాధపడుతూ ఉండేవాడు. ఈ విషయంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలి గదిలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన బీజేపీ నాయకులు.



**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని భిక్నూర్ మండలం తీ–ప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి కేటాయించిన నిధులతో తిప్పాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు ఇరువైపుల రోడ్డుకు సుమారు 8లక్షల రూపాయలతో సిసి పనులను భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లే రోడ్డు బాగాలేదని, ఆసుపత్రికి పోయే రోగులకు, గ్రామస్థులకు ఇబ్బంది కలుగుతుందని శాసనసభ్యులు దృష్టికి తీసుకొని వెళ్లిన వెంటనే 8లక్షల సిసి రోడ్డు మంజూరు చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కి తిప్పాపూర్ గ్రామస్థుల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

## బోనాల వేడుకల్లో టీపీసీసీ చైర్మన్‌కు ఘన సన్మానం



**బిక్కనూర్, (సింగిడి):** ఇస్సన్న పల్లి గ్రామంలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన టీపీసీసీ చైర్మన్‌ను బద్దం ఇంద్రకరణ్ రెడ్డిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం గ్రామస్థులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, మాజీ సర్పంచ్ రాములు, తిరుమల్ స్వామి, పెద్ద బచ్చగారి శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోనం ఎత్తి అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంగరంగ వైభవంగా ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు బోనం ఎత్తి అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్ష జిల్లా కేంద్రం (జర్నలిస్ట్ మిత్రుల సమాచారం కోసం): జిల్లా కేంద్రంలోని 38, 30, 40 వార్డులలో ఆషాఢ మాస మైసమ్మ సహిత పోచమ్మ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తిపారవశ్యంతో జరిగిన ఈ ఉత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వయంగా బోనం ఎత్తుకుని నగర వీధుల్లో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో పట్టణం సుభిక్షంగా ఉండాలి. ఈ సందర్భంగా మున్సిపల్



చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ “ఆషాఢ బోనాల పండుగ మన సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక. ఆ అమ్మవారి దివ్య దయతో జిల్లా కేంద్రంతో పాటు పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఎల్లవేళలా ఆనందంగా ఉండాలని కోరుకున్నాను. మన పట్టణం సస్యశ్యామలంగా వర్ధిల్లుతూ, ప్రతి ఇంటా సుఖసంతోషాలు నిండాలని ఆ శక్తిస్వరూపిణిని వేడుకోవడం “జరిగింది. ఉత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మరియు నాయకులు అత్యంత నిష్ఠతో, వైభవంగా జరిగిన



ఈ బోనాల కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మోటారి శ్రీకాంత్ (స్థానిక కౌన్సిలర్) గొనె సునీత శ్రీనివాస్ (కో–ఆప్షన్ సభ్యురాలు) చాట్ల రాజేశ్వర్ (మాజీ కౌన్సిలర్) ముఖ్య నాయకులు సుకుమార్, సంజీవ్, శ్రీకాంత్, శ్రీనివాస్, నర్సింలు, కిరణ్ మరియు వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాత గడి వద్ద రాత్రివేళ క్షుద్ర పూజలు..

**తాడ్వాయి మండలంలోని పల్లెగడ్డ తండాలో తీవ్ర కలకలం.**

**రుక్మయ్యపల్లి గత్తర జ్ఞాపకాలు..గ్రామస్తుల్లో భయం, గుప్తనిధులు అనుమానం..?**

**కామారెడ్డి రూరల్, (సింగిడి):** తాడ్వాయి మండలంలోని నాలుగైదు దశాబ్దాల క్రితం నిర్మానుష్యంగా మారిన ఒక పురాతన గడి. పగటిపూట కూడా అటువైపు వెళ్లాలంటేనే జనం వణికిపోతారు. అలాంటి చోట శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా ట్రాక్టర్లలో వచ్చిన కొందరు అపరిచిత వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించిన్నట్లు తాడ్వాయి మండలంలోని పల్లెగడ్డ తండాలో ఆరోపణలతో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం. 40–50 ఏళ్ల క్రితం ఆ గడి ఉన్న ప్రాంతంలో రుక్మయ్యపల్లి అనే గ్రామం ఉండేది. ఆ రోజుల్లో గడి సమీపంలో తవ్వకాలు జరపడంతో ఊరికి తీవ్రమైన గత్తర సోకి, ఊరు ఉరే లేకుండా పోయిందని అన్నారు. గతంలో ఒక వ్యక్తి అక్కడ మొరం తవ్వగా, ఆయన ఇంట్లోని ఆవు పాలు పిండితే రక్తం కారిందని, అ గడిలో దీపం సైతం వెలుగేదని, ఆ గడి టచ్ చేయాలంటే ధైర్యం చేయలేరని, రాత్రి అటు వెళ్లాలంటే ఎవరు ధైర్యం కూడా చేయలేదని తండావాసులు అన్నారు. అప్పటినుంచి ఆ గడి జోలికి ఎవరూ వెళ్లడం లేదని చెబుతున్నారు. తండావాసులు భయాందోళనతో

**భూ వివాదమా.? గుప్త నిధులా.?**

గడి స్థలానికి సంబంధించి గత కొన్ని రోజులుగా తీవ్రమైన భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ట్రాక్టర్లలో కొందరు వచ్చి పూజలు జరిపినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ రాత్రి సమయంలోనే అంతమంది రావడం, ఉదయం ఒక్కరు కనిపించకుండ వెళ్లిపోవడం వెనుక పల్లెగడ్డ తండా ప్రజలు పలు అనుమానాలు సైతం వ్యక్తం పల్లెగడ్డ తండా ప్రజలు పలు అనుమానాలు సైతం వ్యక్తం చేస్తున్నారు. గడి ముందు, ప్రక్కన



కొంత గుంత తీసి క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ వివాదాస్పద భూమిలోకి ఎవరూ రాకుండా భయభ్రాంతులకు గురిచేసేందుకే ఈ పూజలు చేశారా..? లేదా గడి కింద గుప్త నిధులు ఉన్నాయనే కోణంలో అర్ధరాత్రి వేళ ఈ పూజలకు పాల్పడ్డారా..? అనే తీవ్ర అనుమానాలు తండా వాసులు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.**

మూఢనమ్మకాలు, క్షుద్రపూజల పేరుతో తండాలో భయాందోళనలు సృష్టిస్తున్న వ్యక్తులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పల్లెగడ్డ తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# లచ్చపేట శివారులో యువతి మృతదేగీం లభ్యం

**కాలిపోయిన స్థితిలో మృతదేగీం గుర్తింపు..**

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెర్మల్**



**దుబ్బాక, (సింగిడి):** దుబ్బాక పట్టణ పరిధిలోని లచ్చపేట శివారులో కాలిపోయిన స్థితిలో యువతి మృతదేహం లభ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ధర్మాజీపేట––రామక్కపేట చౌరస్తా నుంచి రామక్కపేట వైపు వెళ్లే మార్గంలోని శివారు ప్రాంతంలో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించడంతో పాటు స్థానికులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసు అధికారులను అడిగి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను త్వరితగతిన వెలుగులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఘటన వెనుక ఎవరైనా నిందితులు ఉన్నట్లయితే వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెర్మల్, సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుబ్బాక సీఐ టి. రాజేష్, ఎస్ఐ కీర్తిరాజుతో పాటు పోలీసు సిబ్బంది, లచ్చపేట వార్డు కౌన్సిలర్లు బడుగు రాజు, నంద్యాల శ్రీకాంత్ తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి ఆధారాలను సేకరించాలని పోలీసు అధికారులు సిబ్బందిని ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి మృతి ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పాటు పరిసర ప్రాంతాల సమాచారం, సాంకేతిక ఆధారాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించడం ప్రస్తుతం పోలీసులకు ప్రధాన సవాలుగా మారింది. యువతి ఎవరు, ఆమె ఎక్కడి నుంచి వచ్చింది, సంఘటనా స్థలానికి ఎలా చేరుకుంది, ఘటనకు ముందు ఎవరితోనైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించిన అనంతరం ఘటనకు సంబంధించిన మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులను కోరారు. బాధిత కుటుంబాన్ని గుర్తించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో దుబ్బాక సీఐ టి. రాజేష్, ఎస్ఐ కీర్తిరాజు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయిన అనంతరం యువతి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఆపదలో ఆపన్నగీస్తం.. మానవత్వానికి మారుపేరు ఎమ్మెల్యే ప్రభాకరన్న

**రోడ్డుప్రమాదంలో గాయపడిన దంపతులకు స్వయంగా సాయం చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**దుబ్బాక, (సింగిడి):** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో మానవత్వమే ముఖ్యమని నిరూపించారు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి. భూంపల్లి నుంచి బోనాల కొండాపూర్‌కు వెళ్తున్న మార్గంలో బోయిని చంద్రయ్య దంపతులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో రోడ్డుపై పడివుండటాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, వారిని పరామర్శించి మంచినీళ్లు తాగించి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన దంపతులకు ఎలాంటి ఆలస్యం జరగకుండా తక్షణ వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం వెంటనే అంబులెన్స్‌ను రప్పించి, బాధితులను స్వయంగా అంబులెన్స్‌లో ఎక్కించి ఆసుపత్రికి తరలించే వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. అంతేకాకుండా ఆసుపత్రి సిబ్బందికి ఫోన్ చేసి ప్రమాదం గురించి ముందుగానే సమాచారం అందించారు. బాధితులకు ఎలాంటి ఆలస్యం లేకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే కాకుండా, వారి ప్రాణాలను కాపాడేందుకు తక్షణ స్పందన చూపిన ఎమ్మెల్యేతీరుపై స్థానికులు ప్రశంసలు



వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా ఆపదలో ఆపన్నహస్తం అందించే వ్యక్తిగా ప్రభాకర్ రెడ్డి వ్యవహరించిన తీరు మానవత్వానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

# సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ ; సర్పంచ్ బొప్పిడి గోపాల్...



**ఆమనగల్లు, (సింగిడి):** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప మహంకాళి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పుష్కలంగా వర్షాలు కురవాలని పంటలు పాడిపంట చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య వార్డు సభ్యులు రవికుమార్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, నాయకులు బండ లింగం, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, వెంకటేష్, పరశురాం, రాములు, సాయికుమార్, మహేష్, తదితరులున్నారు..

## సైకిల్ కోసం వికలాంగుడి ఎదురుచూపులు

**ఆరు నెలల క్రితం మంత్రికి వినతిపత్రం..**
**ఇప్పటికీ అందని సాయం**



**బుగ్గారం, (సింగిడి):** బుగ్గారం మండల కేంద్రానికి చెంది న వృద్ధ వికలాంగుడు ఎర్రం పాపయ్య తన దైనందిన అవసరాల కోసం సైకిల్ (ట్రైసైకిల్) అందిం చాలని కోరుతూ ఆరు నెలల క్రితం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజే శారు. అయితే ఇప్పటివరకు ఎలాం టి సహాయం అందకపో వడంతో పాపయ్య నిరాశతో ఎదురుచూస్తు న్నారు. వ–యోభారం, వైకల్యం కార ణంగా నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాపయ్యకు రాకపోకలు కూడా కష్టంగా మారాయి. బయటకు వెళ్లేందుకు, నిత్యావసర పనులు చేసుకునేందుకు ప్రత్యేక సైకిల్ ఎంతో అవసరమని ఆయన తెలిపారు. తన పరిస్థితిని వివరించి మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఆరు నెలలు గడిచినా సాయం అందకపోవడంతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు వెంటనే వికలాంగుల ట్రైసైకిల్ అందించాలని పాపయ్య కోరుతున్నారు. వృద్ధ వికలాంగుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## తక్షణ స్పందనతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించిన పిట్లం పోలీసులు.

**ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం.**




**కామారెడ్డి రూరల్, (సింగిడి):** పిట్లం మండల కేంద్రంలోని బాన్సువాడ––పిట్లం ప్రధాన రహదారిలోని చిల్లర్గి గేట్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడినట్లు సమాచారం అందుకున్న వెంటనే పిట్లం పోలీసులు తక్షణమే స్పందించారు. పిట్లం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నవీన్, పండరి, సాయిలు ఘటనాస్థలికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించారు. అనంతరం వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, రహదారి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పిట్లం పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు.

## చుక్కాపూర్‌లో కాంగ్రెస్‌కు మరింత బలం.

## సర్పంచ్ 10 మంది వార్డు సభ్యుల చేరిక.

**రాష్ట్ర ప్రభుత్వ సలగోదారులు షబ్బీర్ అలీ సమక్షంలో చేరిక.**



**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గారితో పాటు 10 మంది వార్డు సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వార్డు సభ్యులు స్వామి, భవిత, దశరథం, సులోచన, పోషయ్య, భవాని, మహేష్, లక్ష్మి, లక్ష్మి గణేష్, బాబు తదితరులకు షబ్బీర్ అలీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికతో చుక్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్, ఆనంద్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు




**భిక్కనూరు, (సింగిడి):** యూత్ కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భిక్కనూరు మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా భిక్కనూరు స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, సేవా భావంతో పనిచేయడం ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అన్నారు. పేదలు, రోగులు, ఆపదలో ఉన్న వారికి చేతనైన సాయం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీవన్, కర్నల శ్రీను, చిరంజీవి, ప్రదీప్, శశి, వంశీ, కిషన్, గంగాధర్, షారూక్, చక్రపాణి, సోహెల్, అశోక్, స్వామి, శ్రీకాంత్, లోకేష్, నిఖిల్, ప్రణయ్, అభిషేక్, బాల ప్రకాష్ పాల్గొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం




**బల్మూర్ (సింగిడి):** కొండ నాగుల శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2026––27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం (దోస్త్) స్పెషల్ డ్రైవ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ పరంగి రవి తెలిపారు. దోస్త్ లో నమోదు చేసుకుని సీటు రానివారు, సీటు వచ్చినా ప్రైవేట్ కళాశాలలో చేరని విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రవేశం పొందవచ్చన్నారు.

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం 10-8-2026

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



- హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి):** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కరీంనగర్‌లోని శుభ మంగళ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం బీజేపీ మండల, జోన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10 నుంచి జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ప్రారంభించి, మండలాల వారీగా తిరంగా యాత్రలు నిర్వహించాలని సూచించారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజలు, విద్యార్థులు స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. ఆగస్టు 12 నుంచి 14 వరకు స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల విగ్రహాలను శుభ్రపరచడంతో పాటు స్మారక చిహ్నాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, కూడళ్లలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా దేశ ప్రజల ఐక్యత, సమైక్యత, అఖండతకు ప్రతీక అని సాయిని మల్లేశం పేర్కొన్నారు. జిల్లాలో దేశభక్తి వాతావరణం నెలకొనేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశం అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని బీజేపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, సీనియర్ నాయకులు బాస సత్యనారాయణరావు, కన్నబోయిన ఓదెలు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

### 52 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** చిన్ననాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చుకుంటూ 52 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకొని ఆప్యాయ ఆలింగనం చేసుకోవడంతో పాటు సంతోషంగా గడిపారు. హుజురాబాద్ లోని కాలేశ్వరం లోగల ముక్తేశ్వర స్వామి దేవాలయ డైరెక్టర్ తాటిపల్లి రాజన్న నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో చిన్ననాటి మిత్రులు ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది తమ తమ అనుభవాలను కుటుంబ పరిస్థితులను తెలియజేయడంతో పాటు చిన్నతనంలో అందరూ కలిసి చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. చాలా సంవత్సరాల తర్వాత చిన్ననాటి మిత్రులు ఒకచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం తాటిపల్లి రాజన్న మాట్లాడుతూ, 1974 సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న మిత్రులు ఒకే చోట కలుసుకోవాలని చేసిన ప్రయత్నం విజయవంతం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. 52 సంవత్సరాల తరువాత అందరం కలుసుకొని ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారి అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపామని ఇలాంటి అవకాశం మళ్ళీ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ పనకంటి చందు ధనుంజయ్ రాధా కిషన్ గంగా శంకర్ రాధా కిషన్ రంగి సత్యనారాయణ ఉమాశంకర్ గట్టు సత్యనారాయణ సుధాకర్ దేవేందర్ బాపురెడ్డి సూర్య ప్రకాష్ అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భూతగాదంలో ఇరువర్గాల ఘర్షణ..

### మహిళకు తీవ్ర గాయం

### ఒప్పందాన్ని విస్మరించి అన్యాయం చేస్తున్నారు

### రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** వీణవంక మండలం లక్ష్మాజిపల్లి గ్రామంలో ఐదు గుంటల భూమికి సంబంధించిన వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో గెల్లు శ్రీనివాస్ యాదవ్ కుటుంబానికి చెందిన రజితకు కాలికి తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బాధితులు తెలిపారు. బాధితుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు సంబంధించిన ఐదు గుంటల భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతోందన్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని దాడి జరిగినట్లు పేర్కొన్నారు. దాడిలో తన భార్య రజిత పై సర్పంచ్ శ్రీనివాస్ దాడి చేయగా కాలుకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ భూమి వివాదానికి సంబంధించి గ్రామ పెద్దమనుషుల సమక్షంలో 2015లో జరిగిన ఒప్పందానికి సంబంధించిన పత్రం తమ వద్ద ఉందని గెల్లు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అయినప్పటికీ తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయడంతో పాటు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. గ్రామ సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ వల్ల తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని బాధితులు ఆరోపించారు. ఈ భూ వివాదంపై పోలీసులు విచారణ జరిపి, ఇరు వర్గాల వాదనలు మరియు అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# నియోజకవర్గం సంక్షేమంపై గళమెత్తిన ఎమ్మెల్యే

- ఇసుక కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇసుకపై నిషేధాజ్ఞలు ఎత్తువేయాలి
- ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో పాడి కౌశిక్‌రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి) :** హుజరాబాద్ నియోజకవర్గం లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి వీణవంక మండలంలోని కల్వల ప్రాజెక్టుకు 70 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని దానితోపాటు తనుగుల చెక్ డాం వెంటనే మరమ్మత్తులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్లీనో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ ఉంటుందని అధికారులు అధికారులు చెబుతున్నారని వెంటనే కన్నేపల్లి పంపులు ఆన్ చేసి హుజురాబాద్ ప్రజలకు తాగునీరు సాగునీరు అందించాలని కోరారు. కరీంనగర్ కొత్త జిల్లాలోని ప్రముఖ రామాలయంగా ఉన్న ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే కమలాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి 25 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీనవక మండలంలోని డబుల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలకు గతంలో మంజూరు చేసిన పదుకొను కోట్ల రూపాయల నిధులతో పనులు ప్రారంభించాలని కోరారు. జమ్మికుంట పట్టణంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్లో 80 శాతం పనులు పూర్తిగా రెండు పట్టణాలకు రెండు కోట్ల నిధులు కావాలని జమ్మికుంట పట్టణంలో 100% టాక్స్ కలెక్ట్ చేయగా ఇన్సెంటివ్ గా రావాల్సిన మూడు కోట్ల రూపాయలు ఇవ్వాలని కోరారు.

**ఇసుక దొరకక ప్రజల ఇబ్బందులు**

నియోజకవర్గంలో ఇసుక రవాణా కారణంగా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఉన్నప్పటికీ 1500 రూపాయలకు దొరకాల్సిన ఇసుక 7500 వరకు విక్రయిస్తున్నారని మంత్రులను దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దపల్లి మానకొండూరు నియోజకవర్గం మాదిరిగా హుజరాబాద్ నియోజకవర్గంలోనూ ట్రాక్టర్లకు ఆన్లైన్ విధానం లేకుండా ఇసుక తరలింపుకు అనుమతులు కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని మానేరు పరివాహక ప్రాంతాల నుండి నియోజకవర్గం పరిధి లోపల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుక రవాణా చేసేందుకు అధికారులు అనుమతించాలని చెక్పోస్టులు ఎత్తేసి ఇసుకను చౌక ధరకు అందేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇసుక దొరకక ఇందిరమ్మ ఇండ్లకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని 7500 రూపాయలు పెట్టి ఇసుకను కొనలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గం దాటి ఇసుక రవాణా జరిగితే కేసులు నమోదు చేయాలని నియోజకవర్గం పరిధి లోపల ఇసుకకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

**దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి**

హుజరాబాద్ నియోజకవర్గంలో పెండింగులో ఉన్న దళిత బంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు సైదాబాద్ జిల్లా పట్టాలను తిరిగి ఇవ్వాలని హుజరాబాద్ మీడియా మిత్రులకు గతంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేశారని వాటిని తిరిగి ఇవ్వాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రద్దు చేసిన కొన్ని ప్రొసీడింగ్స్ కూడా పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కలెక్టర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతోనే నగర అభివృద్ధి జరిగింది

### నగరానికి ప్రత్యేక పథకం ద్వారా రూ.1,000--2,000 కోట్లు తీసుకురావాలి

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ యాదగిరి సునీల్‌రావు




**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి):** కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులతో జరుగుతున్న కరీంనగర్ నగర అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా చెప్పుకుంటూ కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతున్నా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నగర, జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో రాష్ట్ర వాటా చెల్లించడాన్ని మినహాయించి, కరీంనగర్ కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పథకాన్ని అమలు చేయలేదన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్–1, అమృత్–2, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి, రైల్వే వంతెన, కేంద్ర రహదారి నిధులు, పట్టణ సవాల్ నిధి వంటి పథకాల ద్వారా కరీంనగర్‌కు నిధులు కేంద్రం నుంచే వచ్చాయని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో కేంద్రం, రాష్ట్రం చెరో 50 శాతం నిధులు సమకూర్చాల్సి ఉండగా, 46 అభివృద్ధి పనుల్లో 41 పూర్తయ్యాయని పేర్కొన్నారు. అమృత్ పథకం రెండు విడతల్లో రూ. 274 కోట్లు, మూడో విడతలో మరో రూ. 80 కోట్లు వచ్చాయని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో పట్టణ సవాల్ నిధి కింద కరీంనగర్ అభివృద్ధికి రూ. 840 కోట్లు సమకూరా యని సునీల్ రావు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ హామీతో బ్యాంకు రుణాలు, హడ్కో ద్వారా నిధులు సమకూరు తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించడాన్ని గొప్పగా చెప్పుకోవడం సరికాదన్నారు. రైల్వే వంతెన నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించినప్పటికీ భూసేకరణ పూర్తికాక పనులు ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. సేతుబంధన్ పథకం కింద కేంద్రం రూ. 156 కోట్లు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా వాటిని వినియోగించి పనులు పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. కరీంనగర్ నగరానికి ప్రత్యేక పథకం రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 1,000--2,000 కోట్లు తీసుకురావాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. అలా నిధులు తీసుకొస్తే తమ పాలకవర్గం తరఫున ఘనంగా సన్మానిస్తామని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయకుండా, నగర అభివృద్ధికి వాస్తవంగా నిధులు తీసుకురావడంపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గాజ రామశివరాం, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్, 53వ డివిజన్ కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత రమణ్, 43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య గౌడ్, 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్య శ్రీనివాస్, కుంభం అనిల్, పండుగ నాగరాజ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో బీసీ హాస్టల్

### నూతన ఇంటిగ్రేటెడ్ వసతిగృహాన్ని నిర్మించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** జమ్మికుంట మండల కేంద్రంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే బాలుర హైస్కూల్ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ 56 మంది విద్యార్థులు వసతి గృహంలో ప్రతిక్షణం బిక్కుబిక్కుమంటూ, భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారని, హాస్టల్ భవనం మొత్తం స్లాబు, గోడలు పెచ్చులూడుతున్నాయన్నారు. స్లాబ్ పై నుండి వర్షం నీరు రూముల్లోకి వస్తున్నాయన్నారు. డోర్లు లేని రూములు ఉండడం నిజంగా సిగ్గుచేటు అన్నారు. కిటికీలకు డోర్లు లేకపోవడం విద్యార్థులే వారి బట్టలను అడ్డుగా ఏర్పాటు చేసుకొని బస చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులే హాస్టల్ లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా పాలక ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు. 56 మంది విద్యార్థులకు కేవలం రెండు బాత్రూంలే ఉండడం, మిగతా బాత్రూంలో అన్ని పనిచేయకపోవడం తో విద్యార్థులు ఆరు బయటనే స్నానాలు చేస్తున్నారన్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరో భవనంలోకి విద్యార్థులను తరలించాలని డిమాండ్ చేశారు. స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులకు ఏమైనా ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇంత ప్రమాదకరంగా ఉన్న హాస్టల్ను జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే ఎంత మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్ష చేస్తారా అని ప్రశ్నించారు. పాలకవర్గ పార్టీలు రాజకీయాలు పక్కన పెట్టి విద్యార్థుల శ్రేయస్సు కోసం స్పందించాలన్నారు. బాలుర హైస్కూల్ పక్కనే సువిశాలమైన ఖాళీ స్థలం ఉందని అందులోనే ఇంటిగ్రేటెడ్ నూతన హాస్టల్ నిర్మించి, విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికిప్పుడు ఖర్చులు అంచనా వేసి రిపేర్లు చేస్తే అవి త్వరగా మళ్లీ పాడైపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఎంతోమంది విద్యార్థులు ఈ హాస్టల్లో చదువుకొని ప్రయోజకులు అయ్యారని గుర్తు చేశారు. చరిత్ర కలిగిన వసతి గృహాన్ని పాలకులు విస్మరించడం విడ్డూరమన్నారు. ఈ సందర్భంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, కమిటీ సభ్యులు దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, రావుల ఓదెలు, శ్రీనివాస్, మహేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు

### ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు





**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదివారం రోజున పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులచే తెలంగాణ సాంప్రదాయ సాంస్కృతిక పండగ అయిన బోనాల పండుగను ఘనంగా జరుపుకోవడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. వేణు, మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ సంస్కృతి సాంప్రదాయం ఉట్టిపడేలాగా ప్రతి గ్రామశీలో బోనాల పండుగ చాలా ప్రాచుర్యం పొందిందని అలాగే పట్టణాలలో కూడా అందరూ చాలా ఘనంగా నిర్వహించు కుంటున్నారని అందులో భాగంగా ఇల్లందకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ఉపాధ్యాయ బృందం బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు బోనం ఏర్పాటుచేసి అ బోనాన్ని నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా విద్యార్థులు ఉపాధ్యాయులు చక్కగా నిర్వహించడం జరిగినది. ఈనాటి విద్యార్థులకు తెలంగాణ సాంప్రదాయం తెలంగాణ సంస్కృతి ప్రాచీన పండుగలు వాటి ప్రాశస్త్యం తెలియజేయాలని ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థులకు చక్కగా దోహద పడుతుందని తెలిపారు. అదేవిధంగా ఈ ఆషాడ మాసంలో విద్యార్థులందరూ గోరింటాకును వారి చేతులకు అలంకరించుకొని మెహందీ పండుగను కూడా చాలా సంతోష భరితమైన విధానంలో నిర్వహించుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్. వేణు, కే. జయప్రకాష్, యం. సమ్మిరెడ్డి, సిహెచ్. కౌసల్య, జి. అన్నపూర్ణ, కే. సత్యం, ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ, కే. శంకర్, జె. రాధికరాణి, ఎం. సుధాకర్, డి. ఉమాదేవి, ఎం. స్రవంతి, యు. లక్ష్మణ చారి, ఆర్ దేవేందర్, డి. పరమేశ్వర్, వనిత, విశ్వతేజ మరియు పాఠశాల విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## కొత్తపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షుడిగా సంపతి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల వెంకట రమణాచారి



**కొత్తపల్లి, ఆగస్టు 9(సింగిడి):** కొత్తపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు మల్కాపూర్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షుడు, సంఘ వ్యవస్థాపకుడు కొమ్ము గణేష్ ఆధ్వర్యంలో సభ్యుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. సభ్యుల ఏకాభిప్రాయంతో అధ్యక్షుడిగా సంపతి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల వెంకట రమణాచారి, కోశాధికారిగా పర్లపల్లి రాజమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గ సభ్యులను వచ్చే నెలలో ఎన్నుకుని, ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకుడు కొమ్ము గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం మారుతి, కాంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎనగందుల సురేష్, వడ్లకొండ నరేష్ గౌడ్, మంగు రామచంద్రుతో పాటు కొత్తపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

## దర్గా కమిటీ నూతన ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ కరీం



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా ఆలై దర్గా కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ తౌఫిక్ హుస్సేన్ కు గత నెల 12వ తేదీనాడు దర్గా ముజావర్లు ఎన్నుకోగా ఆదివారం పూర్తిస్థాయి దర్గా కమిటీని నియమించడం జరిగినది. దర్గా కమిటీ ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యదర్శిగా మొహమ్మద్ ఇమ్రాన్ హుస్సేన్, కోశాధికారిగా మహమ్మద్ సర్వర్, సంయుక్త కార్యదర్శిగా మొహమ్మద్ నయీముద్దీన్, జాఫర్, షా హుస్సేన్, జబ్బర్ సభ్యులుగా మొహమ్మద్ అల్తాఫ్ ఇమ్రాన్, ఫరీద్ బాబా, సల్మాన్, జలీల్, అలీ షరీఫ్, తాజ్, మసూద్, సమీర్, సర్వర్, గౌస్, ఖాజా పాషా, అక్రమ్ అబ్దుల్ అశు పూర్తిస్థాయి కమిటీని ఆదివారం నియమించినట్లు ఈ కమిటీ మూడేళ్ల పాటు ఉంటుందని దర్గా ముత్తవల్లి మొహమ్మద్ అక్బర్‌అలీ, దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫీక్ హుస్సేన్ తెలిపినారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లి మొహమ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ దర్గాకు వచ్చే భక్తులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు దర్గా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని నిరంతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన నూతన కమిటీకి పిలుపునిచ్చారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
10-8-2026

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా
- చేనేత రంగానికి వరంగల్ నగరం వేదిక
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 9 (సింగిడి):** చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేతను కాపాడుకుంటూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని: ఆయన పిలుపునిచ్చారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మతల్లి బోనాలు



- బోనాల ఊరేగింపును ప్రారంభించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని కరీంనగర్ భగత్‌నగర్‌లో ఆదివారం మైసమ్మ తల్లి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాసరి రాజ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సునీల్ రావు.. అనంతరం డప్పుల మోత, పోతురాజుల నృత్యాల మధ్య మైసమ్మ తల్లి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ--వేణు, నిర్వాహకులు దాసరి రాజ్ ప్రభాకర్, స్థానిక నాయకులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరి కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటుపై నేడు సమావేశం



**కోదాడ, ఆగస్టు 9 (సింగిడి):** అనంతగిరి మండల కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటుపై శనివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నివాసంలో కీలక సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆదేశాల మేరకు ఈ సమావేశం జరుగనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల కమిటీ పునర్వ్యవస్థీకరణ, గ్రామ కమిటీల బలోపేతంతో పాటు నూతన కమిటీల్లో యువతకు అధిక ప్రాధాన్యం కల్పించడంపై చర్చించనున్నట్లు తెలిపారు. మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి,ఆగస్టు 9 (సింగిడి):** వైద్య కళాశాల బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బాలికల వైద్య కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, భవనం అంతర్గత (ఇంటీరియర్) పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున పనుల్లో వేగం పెంచి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు నెలాఖరు నాటికి బాలికల వసతి భవనాన్ని పూర్తిస్థాయిలో అప్పగించాలని స్పష్టం చేశారు. బాలుర వసతి భవన నిర్మాణ పనుల్లో కూడా ఎలాంటి జాప్యం వహించవద్దని, దానిని సెప్టెంబర్ నెలాఖరు నాటికి సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. హాస్టల్ భవనంలో విద్యుత్తు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఎంతమేర విద్యుత్ అవసరమవుతుందో అంచనా వేసి, సమగ్ర నివేదికలు అందించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వేంకటేశ్వర రావు, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా వెంకటరత్నం, ఆర్ అండ్ బీ ఈ ఈ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్ మండలంలో నేడే డబుల్ ఇళ్లకు శ్రీకారం...



- కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరుతున్న సొంతింటి కల..
- మంత్రుల చేతుల మీదుగా పంపిణీ ఇండ్ల పట్టాలు

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి):** సొంతింటి కల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కల నెరవేరే సమయం ఆసన్నమయింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పేదలకు డబుల్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కుడా మాజీ ఛైర్మెన్,పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాం రెడ్డి,హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ఆదివారం రోజున మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమ ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరు పేదలు కలలు కన్న సొంతింటి స్వప్నం నేరవేరబోయే సమయం ఇదిఅని,కమలాపూర్,మర్రిపల్లి గూడెం,గూడూరు గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు డబుల్ ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని,వాటితో పాటు ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి 3500 ఇచ్చామని,రెండవ విడతలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి అర్హులైన పేదవారిని ఆదుకుంటామని తెలిపారు. అనంతరం కమలాపూర్ మండల కేంద్రంలో పార్టీ జెండా గద్దె ఆవిష్కరణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల అధ్యక్షుడు,భీంపల్లి గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీ,కమలాపూర్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్,డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,వార్డు సభ్యులు,పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో విస్తృత తనిఖీలు

గొండ్రియాల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన



**కోదాడ/అనంతగిరి, ఆగస్టు 9 (సింగిడి):** జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం అనంతగిరి మండల కేంద్రంలో ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, టీ దుకాణాలు, మెడికల్ షాపులు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల గుర్తింపు కోసం సోదాలు చేపట్టారు. అనంతరం గొండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, గంజాయి వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10న సాగర్‌లో ముఖ్యమంత్రి పర్యటన

- వరుణయాగం నిర్వహించే యాగస్థలి, పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్





**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 9 (సింగిడి):** ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్ వద్ద నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారన్న ప్రాథమిక సమాచారం మేరకు ఏర్పాట్ల విషయమై నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శుక్రవారం నాగర్జున సాగర్ సమీపంలోని విజయ విహార్ ను సందర్శించారు. వరుణ యాగం నిర్వహించే యాగస్థలి, ప్రవచనశాల ,యాగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల పై దేవాదాయ , రెవెన్యూ, పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యాగశాల ఏర్పాటు చేసే ప్రదేశం, భారీకేడింగ్ , పగోడాల ఏర్పాటు, ప్రవచనశాల ,టెంట్లు, ఎల్ఈడిలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వివిధ ప్రాంతాల నుండి యాగం నిర్వహించేందుకు వచ్చే ఋత్వికులు, అర్చకులకు వసతి సౌకర్యాల వంటి ఏర్పాట్లన్నీ చేయాలని చెప్పారు. అంతేకాక అన్ని చోట్లా భారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ,ప్రవచనాలు వినేందుకు బయట నుండి వచ్చే సాధారణ ప్రజలకు , యాగానికి హాజరయ్యే ప్రముఖులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు అధిరులు హాజరుకానున్న దృష్ట్యా యాగశాల వద్ద యాగాన్ని తిలకించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లతో పాటు,బందోబస్తు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. విజయవిహార్ మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావును ఆదేశించారు. అవసరమైన చోట పగోడాల ఏర్పాటుతోపాటు, తాగునీరు, మూత్రశాలలు, ముందు రోజు నుండి యాగానికి వచ్చే ఋత్వికులు ,అర్చకులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ,వరుణ యాగం నిర్వహించే స్థలం మొత్తం ప్లాన్ తో సహా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పి రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్ ,డీఎస్పీ రవి, ఆర్ ఐ శ్రీనివాస రెడ్డి, తదితరులు ఉన్నారు.

## విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, ఆగస్టు 9 (సింగిడి):** విద్యార్థులే దేశ భవిష్యత్తు, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారంమిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి కలిసి పంపిణీ చేశారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్ , కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను బాగుచేయండి

ప్రధాన రహదారిలో వరినాట్లతో నిరసన

డ్రైనేజీ సమస్యలపై వ్యాపారుల ఆగ్రహం



**భూపాలపల్లి ఆగస్టు 9 (సింగిడి):** భూపాలపల్లి లోని ప్రధాన రహదారిపై వరి నాట్లు వేసి,నిరసన తెలిపిన వ్యాపార వాణిజ్య యాజమాన్యాలు, ఈ ప్రధాన రహదారి గుండా సింగరేణి జనరల్ మేనేజర్ ఆఫీస్, జిల్లా ఎస్పీ ఆఫీస్, పోలీస్ స్టేషన్ మరియు మున్సిపల్ ఆఫీస్ కు వెళ్లేటటువంటి అధికారులు మరియు ప్రజలు నిత్యం ఈ దారి గుండానే ప్రయాణిస్తూ ఉంటారు. చినుకు పడకుండా కూడా ఈ రహదారిలో నిత్యం ఈ రోడ్డు పై నీరు నివసిస్తుంది. ఇక చినుకు పడితే బురద మయమే, చెరువులా అనిపిస్తుంది. కానీ ఏ ఒక్క అధికారి మాత్రం ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం తో మురుగునీరు రోడ్డుపై నిలిచి దుర్వాసన వ్యాపిస్తుందని ఆవేద వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలుస్తున్న నీరును చూసి జనాలు వాపోతున్నారు,కానీ అధికారులు మాత్రం పట్టించుకోరు. రోడ్డు ప్రక్కన ఉన్నటువంటి షాపుల యాజమాన్లు అధికారులకు చెప్పి చెప్పి విసుగుచెంది ఈరోజు రోడ్డు బురదమయంగా ఉండడంతో ఆగ్రహించిన వ్యాపారులు స్థానిక ప్రజలు వినూత్నంగా రోడ్డు పైననే వరి నాట్లు వేసి నిరసన తెలిపారు.

## పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ




**భూపాలపల్లి, ఆగస్టు 9 (సింగిడి):** భూపాలపల్లి పట్టనా అభివృద్ధికి, ప్రజా ఆరోగ్యం,అటవీశాఖ భూముల వివాదాలు పరిష్కారంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొంరయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ వార్డుల్లో నెలకొన్న విద్యుత్తు సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల లోపాలను మరో 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పల్లె దావఖానలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్ కు,ఎమ్మెల్యేకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షయ వ్యాధి, హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బాధితులకు నిరంతరం మందులు, వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం గా ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆసుపత్రికి సింగరేణి విద్యుత్ సరఫరా అనుసంధానంపై మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 14 కోట్లతో కోట్లతో అదనపు అంతస్తు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆసుపత్రి సమస్యల పరిష్కారంపై మరో 15 రోజుల్లో ప్రత్యేక అభివృద్ధి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అటవీ భూముల అంశంలో శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ వివాదాలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. 6, 26,5 వార్డుల్లో నిర్మిస్తున్న రక్షణ గోడ పనులను అనవసరంగా జోక్యం చేసుకోవద్దు అని తెలిపారు. జంగేడు రోడ్డుతో పాటు ప్రధాన రహదారి లోని డబ్బాలను వెనక్కి తరలించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

- మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, ఆగస్టు 9 (సింగిడి):** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండలంలో 65,66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవిత స్థాయిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అర్హులైన పేద మహిళలకు, మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని,భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు కిరణ్ గారు,65వ డివిజన్ అధ్యక్షులుసునీల్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,మండల అధ్యక్షులు అశోక్ కుమార్,మహిళ అధ్యక్షురాలు జోరిక పూల,మహిళ ఉప అధ్యక్షురాలు స్వాతి,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి,వంగపహడ్ పీ ఏ సీ ఎస్ చైర్మెన్ మెరుగు రాజేష్‌గౌడ్,మండల,డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ చేనేత కార్మికులకు సన్మానం




**హన్మకొండ, ఆగస్టు 9 (సింగిడి):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భం గా చేనేత జౌళి శాఖ హన్మకొండ ఆద్వర్యం లో హన్మకొండ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో శాయంపేట సహకార సంఘ సీనియర్ కార్మికుడు పూల ఐలుమల్లును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు జాయింట్ కలెక్టర్ రవిలు ఇద్దరు కలిసి శుక్రవారం సన్మానం చేశారు.
**శాయంపేటలో..** పేట చేనేత సహకార సంఘంలోని కార్మిక పెద్ద మనుషులకు పాలక వర్గం సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షుడు బాసని ప్రకాష్ ,ఉపాధ్యక్షులు డీ.రమేష్ కార్యదర్శి వనం దేవరాజు ,కోశాధికారి బాసని నవీన్, డైరెక్టర్స్ సామల రవీందర్, దాసరి సమ్మయ్య, బాసని బాలకృష్ణ,బాసని ఉమాదేవి, వలుపదాసు స్వరూప సంఘం కార్మికులు పాల్గొన్నారు.

## షైన్ పాఠశాలలో బోనాల పండుగ



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**భూపాలపల్లి ఆగస్టు 9 (సింగిడి):** తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని షైన్ పాఠశాల కరస్పాండెంట్ భానుచందర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక షైన్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారు, పోతరాజు, బోనం తదితర వేషధారణతో నిర్వహించిన బోనాల ఊరేగింపు, జానపద నృత్యాలు, సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో పాఠశాల ఆవరణంలో అంతా పండుగ వాతావరణం తో నిండిపోయింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బోనాల పండుగ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సాంస్కృతిపై గౌరవాన్ని సాంప్రదాయాల పట్ల అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ స్రవంతి, ఇన్చార్జి రాజేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి
# ఉచిత వైద్య సేవలు

**బాలవికాస సేవలు అభినందనీయం**

**సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి.. వల్బాపూర్ లో ఉచిత వైద్య శిబిరం**





**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
వీణవంక మండలం వల్బాపూర్ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జమ్మికుంట ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చన్నారు. జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల యువతలో ఊబకాయం పెరుగుతోందని, బరువును నియంత్రించుకోవడం ముఖ్యమని తెలిపారు. ఆదిత్య ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సంస్థ సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆదిత్య, అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో గతంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత పరీక్షలు, మందులు అందించామని, భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. తమ స్వగ్రామమైన వల్బాపూర్ ప్రజలకు ఆసుపత్రిలో ఉచిత ఓపీ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇంటిని ఆరోగ్యానికి తొలి కేంద్రంగా మార్చాలని సూచించారు. బాలవికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధి లోని 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సెంటర్ల పరిధిలోని దాతల సహకారంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, కరోబార్ రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఆదిత్య ఆసుపత్రి పీఆర్వోలు రఫిక్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, అనూష, శృతి తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అల్లుడి వేధింపులు భరించలేక మామ ఆత్మహత్య

**అల్లుడి వేధింపులు భరించలేక మామ ఆత్మహత్య**

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
తన కూతురు సుఖసంతోషాలతో ఉండాలని అత్తింటి వారు అడిగిన కట్న కానుకలతో కూతురి వివాహం చేసినప్పటికీ అదనపు కట్నం కావాలని అల్లుడు వేధింపులకు గురి చేయడంతో ఆ బాధ భరించలేక ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రామిడి సంజీవరెడ్డి (50) అనే వ్యక్తి తన కూతురు రజితను అదే గ్రామానికి చెందిన శ్రావణ్ కుమార్ తో గత 14 సంవత్సరాల క్రితం వివాహం జరిపించాడు. కట్నం గా ఒక ఎకరం 20 గుంటల భూమితో పాటు బంగారం కూడా ఇచ్చాడు. కొన్ని సంవత్సరాల తరువాత అల్లుడు శ్రావణ్ కుమార్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తన కూతురు రజిత ను మానసికంగా శారీరకంగా హింసించడమే కాకుండా అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేశాడు. గత కొద్ది రోజుల క్రితం ఇదే విషయం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి తన కూతురిని కాపురానికి తీసుకువెళ్లాలని ప్రాధేయ పడినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో తన కూతురు జీవితం అల్లుడు వల్ల నాశనం అవుతుందని భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ కి తరలించారు. ఈ క్రమంలో శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు తన భర్త మృతికి కారణమైన శ్రావణ్ కుమార్ మణెమ్మ మల్లారెడ్డి లపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య వెంకటమ్మ వీణవంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

## జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
రైతు , సీఐటీయూ, వ్యవసాయ కార్మిక,సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 10న కరీంనగర్‌లో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కమిటీ కార్యదర్శి జక్కుల రమేష్ కోరారు. ఈ సందర్భంగా శనివారం వారు మీడియాతోమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విద్యుత్ సంస్కరణలను వెంటనే ఉపసంహరించు



కోవాలని, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధిని దెబ్బతీసే చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, కార్మికులు ఉపాధి భద్రత కోల్పోతున్నారని, వ్యవసాయ కూలీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న కరీంనగర్‌లో జరిగే జైలు భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని అయన పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రత్యక్షంగా పోరాటాలలో పాల్గొంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, కన్నం సదానందం, రావుల ఓదెలు, కోక్కర్ల మహేష్, సారయ్య,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## చిత్రకళలో ప్రతిభ చాటుతున్న సనా






**కోదాడ,ఆగస్టు 9(సింగిడి):**
అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన గరిడేపల్లి సనా చిన్న వయసులోనే చిత్రకళలో ప్రతిభను కనబరుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వివిధ అంశాలపై తన ఊహాశక్తికి పదునుపెట్టి సృజనాత్మకంగా చిత్రాలను స్వయంగా రూపొందిస్తోంది. ప్రకృతి దృశ్యాలు, సామాజిక అంశాలతో పాటు పలు రకాల చిత్రాలను అద్భుతంగా చిత్రిస్తూ తనలోని కళా నైపుణ్యాన్ని చాటుకుంటోంది. సనా రూపొందించిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటూ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. చిన్న వయసులోనే చిత్రకళపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేస్తుండటంపై గ్రామస్తులు అభినందిస్తున్నారు.

**ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ప్రతిభ కనబరిస్తా..**
సనా మాట్లాడుతూ:....."చిత్రకళపై నాకు ఎంతో ఆసక్తి ఉంది. వివిధ అంశాలపై కొత్తగా చిత్రాలు గీయడం నాకు చాలా ఇష్టం. మరింత మెరుగ్గా చిత్రాలు గీయడానికి నిపుణుల శిక్షణ, ప్రభుత్వం, కళా సంస్థల ప్రోత్సాహం లభిస్తే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తాను" అని తెలిపింది.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

**బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జే కే**

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జేకే ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలపై బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం కొనసాగిస్తున్న నిరంతర పోరాటాలు, ప్రజాస్వామ్య బద్ధమైన శాంతియుత ఉద్యమాల ఫలితంగా ఫీజుల పారదర్శకత దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తొలి అడుగుగా భావిస్తున్నామని వారు తెలిపారు.



ఫీజుల వివరాలను ప్రదర్శించడం మాత్రమే సరిపోదని, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం భరించలేని స్థాయిలో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిని నివారించేందుకు తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేక "ఫీజుల నియంత్రణ క్రమబద్ధీకరణ బిల్లు" ప్రవేశపెట్టాలని కోరారు. విద్య హక్కు, వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారాన్ని మోపడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి చేస్తున్న సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అసెంబ్లీలో బలమైన చట్టాన్ని తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం మరింత ముందుకు రావాలని కోరారు.విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే వరకు, అధిక ఫీజుల భారం తగ్గే వరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## రాష్ట్ర నిధులతో అభివృద్ధి.. బీజేపీ ప్రచారం

**కరీంనగర్‌కు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలి సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్, ఆగస్టు8(సింగిడి )**
కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి కింద రూ.50 కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుందని, ఇందులో కేంద్రం వాటా లేదని తెలిపారు. పట్టణ సవాల్ నిధి కింద కరీంనగర్‌కు మంజూరైన రూ.840 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.210 కోట్లు, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి సంస్థ రుణం కింద మరో రూ.420 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కేంద్రం 25 శాతం వాటాగా రూ.210 కోట్లు మాత్రమే ఇస్తుందని పేర్కొన్నారు.స్మార్ట్ సిటీ మిగిలిన పనులకు అవసరమైన రూ.140 కోట్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.70 కోట్లు సమకూర్చిందని, కేంద్రం తన వాటా రూ.70 కోట్లు విడుదల చేయలేదని ఆరోపించారు. ఈ అంశాలపై బండి సంజయ్ చర్చకు సిద్ధమా అని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. సంబంధిత నిధుల మార్గదర్శకాల ప్రతులను ఆయనకు పోస్టు ద్వారా పంపిస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కేంద్రం నుంచి కరీంనగర్‌కు మరిన్ని నిధులు తీసుకురావాలని, ముఖ్యంగా యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ప్రాజెక్టులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జగన్ రెడ్డి, నాయకులు పిట్టల రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అపోహలు వీడాలి.. వాస్తవాలు తెలుసుకోవాలి

**వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**




**అశ్వాపురం, ఆగస్టు 9(సింగిడి):**
హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం లింక్ వర్కర్ రాణి అన్నారు. శనివారం అశ్వాపురం మండలం జగ్గారం గ్రామంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా లింక్ వర్కర్ రాణి మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రధానంగా అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు లేదా సిరంజీల వినియోగం, కలుషితమైన రక్త మార్పిడి, హెచ్ఐవీతో జీవిస్తున్న తల్లి నుంచి బిడ్డకు సంక్రమించే అవకాశాలు ఉంటాయని వివరించారు. హెచ్ఐవీపై అపోహలు, అనవసర భయాలు వీడి, వ్యాధి వ్యాప్తికి సంబంధించిన వాస్తవాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదని, వారిని చిన్నచూపు చూడకుండా మానవతా దృక్పథంతో ఆదరించాలని ఆమె కోరారు. హెచ్ఐవీపై సరైన అవగాహన కల్పించడం ద్వారా అపోహలను తొలగించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగ్గారం గ్రామ సర్పంచ్ సున్నం తిరుపతమ్మ, ఏఎన్ఎం వెంకట నరసమ్మ, ఆశా వర్కర్ జానకి తో పాటు గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

# సెలవు రోజునా 'క్లాసుల' దందా!

**ఓ ప్రైవేట్ కళాశాల వద్ద ఉద్రిక్తత.. ఏబీవీపీ ఆందోళన**

**కళాశాల యాజమాన్యం–విద్యార్థుల మధ్య తోపులాట.. పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం**






**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 8 (సింగిడి):**
ప్రభుత్వ సెలవులను సైతం లెక్కచేయకుండా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయంటూ ఏబీవీపీ శనివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రత్యేక సెలవు రోజున తరగతులు నిర్వహించడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన ఏబీవీపీ విద్యార్థులు, కళాశాల నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది. ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో విద్యార్థులను కళాశాలలకు రప్పించి తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ ఏబీవీపీ నాయకులు ముందుగా కళాశాల యాజమాన్యాన్ని కలిసి వివరణ కోరేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తమను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అనంతరం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. 'చదువు పేరుతో ఒత్తిడి.. సెలవు రోజుల్లోనూ క్లాసులా?' అంటూ కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులపై అధిక ఒత్తిడి పెంచుతూ, విద్యను వ్యాపారంగా మార్చి సెలవు రోజులను సైతం వదలకుండా తరగతులు నిర్వహించడం దారుణమని ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వం, విద్యాశాఖ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కళాశాలలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను ప్రశ్నించినందుకు వారిపైనే దాడులకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. ఆ ప్రైవేట్ కళాశాల యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో సమాచారం అందుకున్న పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. తోపులాటకు దారితీసిన పరిస్థితులు, ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కళాశాల పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## పారమిత హెరిటేజ్ స్కూల్‌లో విద్యార్థి మంత్రివర్గ ఎన్నికలు

**ఇ-బ్యాలెట్ విధానంలో ఓటు హక్కు వినియోగించిన విద్యార్థులు**




**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి)**
కొత్తపల్లి మండలం పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం విద్యార్థి మంత్రివర్గ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఈ ఎన్నికలు నిర్వహించారు.ప్రధాన విద్యార్థి నాయకుడు, ప్రధాన విద్యార్థి నాయకురాలితో పాటు క్రీడలు, క్రమశిక్షణ, సాంస్కృతిక విభాగాల నాయకులు, ఉపనాయకులను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇ–బ్యాలెట్ విధానంలో ఓటు వేసి ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులే ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, అధ్యక్ష అధికారులు వంటి బాధ్యతలను నిర్వహించడం విశేషం. విద్యార్థులు ఉత్సాహంగా, క్రమశిక్షణతో ఎన్నికల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ తంగేళ్ల ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సుగాటి కోటేశ్వర్‌రావు, విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ. ప్రసాద్‌రావు హాజరయ్యారు. అభ్యర్థులతో మాట్లాడి ఎన్నికలకు వారి సన్నద్ధత, సాధారణ ఎన్నికలపై అవగాహనను తెలుసుకున్నారు. నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణపై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఓటుకు సమాజంలో ఎంతో విలువ, ప్రాధాన్యత ఉందని, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని అన్నారు. చిన్న వయస్సులోనే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం ద్వారా మంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయ కర్తలు నాగరాజు, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

Singidi
సోమవారం
10 ఆగస్టు 2026

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత రానివ్వం

**రూ.5 వేల కోట్ల విడుదలకు లైన్ క్లియర్... ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల.. త్వరలో మరో రూ.3 వేల కోట్లు**

**అనుమతుల పేరుతో పనులు ఆగొద్దు.. కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు.. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులు వెంటనే పునఃప్రారంభించాలి**

**పత్తిపాక డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం.. 96 శాతం పూర్తయిన రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం చేయాలి.. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్ ప్రతినిధి ఆగస్టు 9 సింగిడి**
రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాస–పునర్నిర్మాణం కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్ల నిధులు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.
ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియలో ఉందని తెలిపారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన సమగ్ర సమీక్షలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

**భూసేకరణకు నిధులు అడగండి..**
**ఆలస్యం చేయొద్దు**
ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ పరిపాలనా అంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇంజినీరింగ్ పనులు ఒకవైపు కొనసాగుతుండగానే సవ్యమైన ప్రాంతాల్లో భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలని స్పష్టం చేశారు.ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసి వాటి ఫలాలను రైతులకు అందించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని ఉత్తమ్ తెలిపారు. మిడ్‌మానేరు ఎడమ కాలువకు మళ్లీ కదలిక సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూసంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన—ఇవన్నీ ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రక్రియల పేరుతో మరోసారి పనులు నిలిచిపోకుండా నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

**పత్తిపాకతో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు భరోసా**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి–83 నుంచి డి–94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. పత్తిపాక వద్ద 3 టీఎంసీల లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి**
జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరివాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యం.మూడు బండ్లు, సర్ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. అయితే బండ్–2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి.
ప్రత్యామ్నాయ అటవీకరణకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన మిటిగేషన్ ప్లాన్‌కు ఆమోదం లభించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతి సమస్యకు 'యాక్షన్ పాయింట్'**
ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా సిద్ధం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు.ఏ ప్రాజెక్టులో ఏ సమస్య ఉంది? దాని పరిష్కారానికి ఎంత నిధి అవసరం? ప్రస్తుతం ఏ దశలో ఉంది? ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అనే అంశాలన్నింటినీ స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు.సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ లేదా అటవీ అనుమతుల కారణంగా ఏ సాగునీటి ప్రాజెక్టు నిలిచిపోయినా వెంటనే ప్రతిపాదనలు పంపండి. నిధులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు మరింత ఆలస్యం లేకుండా నీరు అందించడమే మా లక్ష్యం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.
సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లి నీటితో నిండిన చెరువుకు పూలాభిషేకం

**వెలిచాల రాజేందర్‌రావు పిలుపుతో ఆసిఫ్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**



**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి)**
ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ (బావుపేట) గ్రామంలోని చెరువులు నిండాయి. దీంతో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు చెరువు మత్తడికి పూలాభిషేకం చేసి నీటికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని కాళేశ్వరం నీటిగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే పూలాభిషేక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం, సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పిలుపు మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావణవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు దుర్గం అంజయ్య గౌడ్, గుండ మల్లేశం, ఓరుగంటి చంద్రయ్య, దూలం మధుసూదన్ గౌడ్, జిందం ప్రసాద్, దుర్గం శ్రీనివాస్, దుర్గం పరశురాములు, రావణవేని తిరుపతి, ఎం.డి. నైమోద్దిన్, లక్కాకుల నర్సింగరావు, దావ తిరుపతి, దావ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లూబెల్స్ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన**

**పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయురాలు జంగా సునీత మనోహర్ రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి)**
హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ ఇన్నోవేటివ్ హైస్కూల్‌లో శనివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేసే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు తెలంగాణ సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పోతరాజుల వేషధారణ, శివశక్తుల నృత్యాలు, డప్పుచప్పుళ్లు, జానపద పాటలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. సంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసి, డప్పుచప్పుళ్ల నడుమ అమ్మవారికి సమర్పించారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయురాలు జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమానికి బి. సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు హాజరై విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. బోనాల పండుగ ప్రాధాన్యతను వివరించారు. వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు తప్పనిసరి

**సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటే ప్రతిభతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం.**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**




**కరీంనగర్, ఆగస్టు8(సింగిడి)**
విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని, తద్వారా ప్రతిభను పెంపొందించుకుని విజయాలను సాధించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.విద్యార్థుల్లో సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన పెంచడంతో పాటు వాటిలో పాల్గొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహించిన 12 గంటల నిరంతర సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం. స్నేహిత, మూడో తరగతి విద్యార్థిని అదిత్రీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించడం అభినందనీయమన్నారు.విజేతలకు పుష్పగుచ్ఛాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జనసేన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ జనసైనికులకు జనసేన నేత డాక్టర్ బండారి రాజ్‌కుమార్ పిలుపు**



**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి)**
ఈ నెల 9న జరగనున్న జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఆత్మీయ సమావేశాన్ని జనసైనికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జనసేన నేత డాక్టర్ బండారి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆత్మీయ సమావేశానికి జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి, రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. బొమ్మకల్‌లోని నూతన జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించ నున్నట్లు చెప్పారు.ర్యాలీ కోర్టు చౌరస్తాకు చేరుకున్న అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని, మార్కెట్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన తర్వాత వాసర గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ముఖ్య అతిథులు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ కృష్ణప్రియ, కందుల రాజిరెడ్డి, కాస రాజు, పెంటల మహేష్, చల్ల శివారెడ్డి, పైసా మోజెష్, చిట్టి ఉదయ్‌కుమార్ రెడ్డి, మొగిలిపాలెం రమేష్, పొన్నాల తిరుపతి, వేముల శిరీష, వీర్ల శ్రీనివాసరావు, పాతూరి వేణుగోపాల్ రెడ్డి, మహాదేవుని రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సుభాష్‌నగర్‌లో వృద్ధురాలిపై దాడి

**బాధితురాలిని పరామర్శించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు**

**కరీంనగర్, ఆగస్టు 9(సింగిడి)**
నగరంలోని 27వ డివిజన్ సుభాష్‌నగర్‌లో వృద్ధురాలిపై దాడి చేసి నగలు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జంగం రాజమ్మ ఇంట్లోకి కిసాన్‌నగర్‌కు చెందిన మునుగొండ మధు చొరబడి ఆమెపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో రాజమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె మెడలోని పుస్తెలు, కమ్మలు తీసుకుని నిందితుడు పరారైనట్లు సమాచారం.దాడిలో గాయపడిన రాజమ్మ నగరంలోని ఏషియన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించి, తక్షణ ఆర్థిక సహాయం అందించారు.ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేయడం దారుణమని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని యాదగిరి సునీల్‌రావు కోరారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామల–కిరణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్ధార్థ విద్యాసంస్థల్లో ఘనంగా బోనాల వేడుకలు

**విద్యార్థుల్లో భక్తిభావం, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం: పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి**



**కరీంనగర్, ఆగస్టు8(సింగిడి)**
కరీంనగర్ భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని రంగవల్లులు, పూలతో అందంగా అలంకరించారు. విద్యార్థులు ఇంటివద్దే బోనం కుండలను అలంకరించుకుని పాఠశాలకు తీసుకువచ్చారు.పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ దాసరి స్వప్న రెడ్డి పోచమ్మ తల్లికి జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న సమాజంలో విద్యార్థుల్లో ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందించేందుకు సంప్రదాయ పండుగలు దోహదపడతాయని అన్నారు. పంచభూతాలను గ్రామదేవతలుగా భావించి బోనాన్ని నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలను విద్యార్థులకు వివరించారు.వేడుకల్లో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలు ఎత్తుకుని సందడి చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.






# జమ్మికుంటలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్" సర్వే

**సర్వేకు ప్రజలు సహకరించాలి**

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్, జి. రాజిరెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధ గోని రామకృష్ణ గౌడ్ ని వారి కార్యాలయంలో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి, సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు .సర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు, అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ ప్లాట్ ఫారమ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచ బడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్ బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఒకేషనల్ కళాశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
జమ్మికుంట ఒకేషనల్ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక పరస్పరం ఆరాధన,సామరస్యంతో మన గౌరవానికి నిలువెత్తు నిదర్శనం బోనాల పండుగ ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థిని విద్యార్థులు డీజే,భక్తి నృత్యాలతో విద్యార్థినిలు బోనాలు,పోతురాజుల వేషాధారణ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ షైక్ అబ్దుల్లా మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థల బాధ్యత అని అన్నారు. తెలంగాణ బోనాల పండుగ మన సంస్కృతికి, గ్రామీణ జీవన విధానానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ అన్నబోయిన రాజేందర్ అధ్యాపకులు, సమ్మయ్య, శ్రీవాణి, సతీష్, మౌనిక, కిషన్, మౌలిక, అనిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

**అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు**



**జమ్మికుంట, ఆగస్టు 9 (సింగిడి)**
పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవని శాయంపేట సర్పంచ్ సురేందర్‌రావు ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి అన్నారు. జమ్మికుంట మండలంలోని శాయంపేట అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సర్పంచ్ సురేందర్ రావు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించాలని, అవి బిడ్డ పెరుగుదలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిపాలలో పోషకపదార్థాలు ఉంటాయని ప్రతి ఒక్కరు నార్మల్ డెలివరీ అయిన సిజేరియన్ అయినప్పటికీ ముర్రుపాలు తాగించవచ్చునని పేర్కొన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు చేయడంతో పాటు పోషక పదార్థాలకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరు నెలలు నిండిన వారికి అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉదయశ్రీ, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్యం



**ఆరోగ్యంగా ఉండాలంటే ఆయుర్వేద ప్రకారం ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలి..? ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆహారం శరీరంలో సరిగ్గా జీర్ణమై పోషకాలుగా మారడం కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేదం చెబుతోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విధానం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర తత్వం భిన్నంగా ఉంటుంది.**

ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆహారం శరీరంలో సరిగ్గా జీర్ణమై పోషకాలుగా మారడం కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేదం చెబుతోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విధానం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. అందువల్ల అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని, వ్యక్తిగత శరీర స్వభావానికి అనుగుణంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం మంచి ఆరోగ్యానికి మూలం బలమైన జీర్ణవ్యవస్థ. ఆహారం సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందించినప్పుడు జీవక్రియలు సమతుల్యంగా పనిచేస్తాయి. వ్యక్తి శారీరక అవసరాలకు అనుగుణంగా తీసుకునే ఆహారం ఔషధంలా పనిచేసి జీవక్రియలను సమతుల్యం చేయడంతోపాటు శరీరానికి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని ఆయుర్వేదం పేర్కొంటోంది.

**మూడు ప్రధాన దోషాలు..**

మనిషి ప్రకృతిలో భాగమేనని భావించే ఆయుర్వేదం శరీరాన్ని మూడు ప్రధాన దోషాల ఆధారంగా వివరిస్తుంది. అవే వాత, పిత్త, కఫ. ఈ మూడు శక్తులు ప్రతి వ్యక్తిలో వేర్వేరు నిష్పత్తుల్లో ఉంటాయని, వాటి ఆధారంగానే ఆహార అవసరాలు కూడా మారుతాయని చెబుఓంది. అందుకే ఒకరికి అనుకూలమైన ఆహారం మరొకరికి తప్పనిసరిగా సరిపోవాల్సిన అవసరం లేదని వివరిస్తోంది. వాత దోషం అధికంగా ఉన్నవారికి ఉడికించిన ధాన్యాలు, వెన్న, పాల పదార్థాలు, గింజలు, ఉడికించిన కూరగాయలు అనుకూలంగా ఉంటాయి. అయితే పచ్చి సలాడ్లు, ఎక్కువ పండ్లు, బీన్స్ వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం మంచిది. పిత్త దోషం ఎక్కువగా ఉన్నవారికి పచ్చి సలాడ్లు, ఉడికించిన ధాన్యాలు, పాలు, విత్తనాలు అనుకూలమైన ఆహారాలు కాగా ఎక్కువ కారం, వేడి పదార్థాలు, పులుపు ఎక్కువగా ఉన్న ఆహారాలు, డీప్ ఫ్రై చేసిన వంటకాలు, పెరుగు, వెనిగర్ వంటి పులియబెట్టిన పదార్థాలను తగ్గించాలి.

**కఫ దోషం ఉంటే..**

కఫ దోషం అధికంగా ఉన్నవారు సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, మసాలా ఆహారం, క్వినోవా, మిల్లెట్స్, మొక్కజొన్న పిండి, బక్‌వీట్ వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. పాల పదార్థాలు, మాంసాహారం, చీజ్, గింజలు, గోధుమలు, బియ్యం వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. ఆయుర్వేదం సూచించే సాధారణ ఆహార నియమాల్లో తాజా ఆహారానికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. సీజన్‌కు అనుగుణంగా స్థానికంగా పండిన తాజా ఆహారాల్లోనే అధిక పోషకాలు లభిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే సహజమైన సంపూర్ణ ధాన్యాలు, సంపూర్ణ పండ్లు, కాలానుగుణ కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం మంచిది.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం

## జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం, ఆగస్టు 9 (సింగిడి ):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ★జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ★ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయని, పోలింగ్ స్టేషన్ వారీగా డిజిటలైజేషన్ నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక పరిశీలనలో జిల్లాలో 95,740 మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు, 33,134 మంది మరణించినట్లు గుర్తించామని తెలిపారు. 42,814 మంది ఓటర్లు మ్యాపింగ్ పూర్తి కాలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని తెలిపారు. ఆగస్టు 10, 2026 నాటికి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 19 క్రొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ స్టేషన్లను వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు,జి.సూర్య నారాయణ, బీ.ఆర్.ఎస్. ప్రతినిధులు ఎం.రమేష్, బి వేణుగోపాల్, సిపిఎం డి.తిరుపతి రావు, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, ఆప్, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో కేంద్ర బృందం అధ్యయనం

## గ్రామీణ పారిశుద్ధ్య సేవలపై రెండు రోజుల క్షేత్రస్థాయి పరిశీలన

## చల్వాయి, మేడారం గ్రామాల ఎంపిక

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9 (సింగిడి):** గ్రామీణ పారిశుద్ధ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వ బృందం ములుగు జిల్లాలో రెండు రోజుల పాటు క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం తన కార్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ (ఐఈజీ) బృందం, యూనిసెఫ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద గ్రామీణ పారిశుద్ధ్య ఆస్తుల నిర్వహణ, సేవల కొనసాగింపుకు భవిష్యత్తులో అవసరమయ్యే నిధులను అంచనా వేయడమే ఈ అధ్యయనం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ సహకారంతో ఆగస్టు 5, 6 తేదీల్లో జిల్లాలోని చల్వాయి మరియు మేడారం గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనుంది. పారిశుద్ధ్య మౌలిక సదుపాయాల నిర్వహణ, నిర్వహణ వ్య యాలు, భవిష్యత్ అవసరాలపై వివరాలను సేకరించనుంది. దేశవ్యాప్తంగా తెలంగాణ, అసోం, గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ అధ్యయనం నిర్వహిస్తుండగా, తెలంగాణ నుంచి ములుగు, నారాయణపేట జిల్లాలను ఎంపిక చేశారు. అధ్యయనం అనంతరం సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కేంద్ర బృందానికి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. సంపత్‌రావు, ఐఈజీ బృంద సభ్యులు డాక్టర్ నితీష్ ఖన్నా, అనుకేత్, యూనిసెఫ్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీహరి నక్క, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి. రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, ఏడీపీ ఎం. వెంకటనారాయణ, స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు మైమున్నిస్సా, షర్ఫున్నిస్సా పాల్గొన్నారు.

## ఒత్తిడి, నిద్రలేమి సమస్యలకు

# హెర్బల్ టీతో చెక్



ఒత్తిడి, ఆందోళన నేటి జీవనశైలిలో సర్వసాధారణ సమస్యలుగా మారాయి. ఇలాంటి సమయంలో చాలామంది మందులపై ఆధారపడుతుంటారు. అయితే కొన్ని సహజ మూలికలతో తయారుచేసిన హెర్బల్ టీలు మనసుకు ప్రశాంతతను అందించడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఒక కప్పు వేడి హెర్బల్ టీ శరీరంతో పాటు మనసుకు కూడా సేదతీరే అనుభూతిని కలిగిస్తుంది. గ్రీన్ టీ ఒత్తిడిని తగ్గించేందుకు ఎక్కువగా ఉపయోగించే హెర్బల్ పానీయాల్లో ఒకటి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, శరీరంలోని మలినాలను తొలగించడంలో సహాయపడటమే కాకుండా, ఇందులో ఉండే పాలీఫినాల్స్ ఆందోళనను తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. రోజ్ టీ కూడా నరాలను ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడే పానీయంగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా రాత్రి నిద్రకు ముందు దీనిని తీసుకుంటే మంచి నిద్రకు దోహదపడుతుందని చెబుతున్నారు. ఎండబెట్టిన గులాబీ రేకులను నీటిలో మరిగించి, అవి ముదురు రంగులోకి మారిన తర్వాత వడగట్టి తాగవచ్చు.

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం పడింది. మరోవైపు, ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు ఆఖర్లో కొలుకుని లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 79,055.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,428.95) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 79,055.38 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకొని 78,285.74 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరికి సెన్సెక్స్ 152.05 పాయింట్లు లాభపడి 78,581 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 9.75 పాయింట్లు పెరిగి 24,624.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.13 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, కోటక్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, రిలయన్స్, బీఈఎల్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 80.69 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# వడ్డీరేట్లను మరోసారి యథాతథం

## నాలుగోసారీ.. వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్‌లో జరిగిన సమీక్షల్లోనూ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్‌లో నౌకల రాకపోకలకు అంతరాయాలు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే బలమైన డిమాండ్ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇస్తోంది. చమురు, ఆహారధాన్యాల అధిక ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరగనుంది. మూడో త్రైమాసికంలో గరిష్ఠస్థాయికి చేరి, తర్వాత నుంచి కాస్త దిగిరానుంది.

# వాట్సప్ గ్రూప్ వినియోగదారుల కోసం కొత్త అప్‌డేట్స్



ప్రముఖ మెసెజింగ్ ప్లాట్‌ఫాం వాట్సప్.. గ్రూప్‌లు వినియోగదారుల కోసం కొత్త అప్‌డేట్లు తీసుకొచ్చింది. పోల్స్‌ను మరింత సులభం చేసింది. గ్రూప్ సభ్యులందరినీ ట్యాగ్ చేయడానికి @all అనే కొత్త ఆప్షన్‌ను పరిచయం చేసింది. గ్రూప్‌లోని సభ్యులతో మరో గ్రూప్‌నూ క్రియేట్ చేసే సదుపాయాన్నీ తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ ఫీచర్లు చాలా మందికి అందుబాటులోకి వచ్చాయి. ఓసారి ప్రయత్నించండి. వాట్సప్ గ్రూపులో ఏదైనా విషయంపై ఓటింగ్ కోసం పోల్స్ పెడుతుంటాం. ఆ పోల్స్ మనం డిలీట్ చేసేంతవరకు అలానే ఉంటాయి. ఇకపై ఆ పోల్స్ ఎప్పుడు ముగియాలో టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఆ సమయం పూర్తికాగానే ఓటింగ్ ఆటోమేటిక్‌గా లాక్ అవుతుంది. పోల్స్‌కి ఎంత మంది ఓటు వేశారో, ఎవరెవరు స్పందించారో ఇకపై గ్రూప్ సభ్యులకు తెలియకుండా చేయొచ్చు. పోల్ పెట్టిన వ్యక్తికి మాత్రమే కనిపిస్తుంది. దీంతో గ్రూపు సభ్యులు వారి భావాలను ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పొచ్చు. పోల్ క్రియేట్ చేసిన తర్వాత 15 నిమిషాలలోపు ఎడిట్ చేసే ఆప్షన్ కూడా తెచ్చింది. ఏదైనా ముఖ్యమైన విషయాన్ని గ్రూప్‌లో పంచుకున్నప్పుడు అందరినీ ఒకేసారి ట్యాగ్ చేసేలా @all ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొచ్చింది. ఇలా మెన్షన్ చేసినప్పుడు ఒకేసారి అందరికీ నోటిఫికేషన్ వెళ్తుంది. 32 కంటే ఎక్కువ మంది ఉన్న గ్రూప్‌లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. ఈ ఆప్షన్ కేవలం అడ్మిన్లకే. గ్రూప్ చాట్‌లను మ్యూట్ చేసినా @all ఆప్షన్‌తో నోటిఫికేషన్ వస్తుంది. అది కూడా వద్దనుకుంటే అలర్ట్‌లను ప్రత్యేకంగా మ్యూట్ చేయొచ్చు. ప్రస్తుతం ఉన్న గ్రూప్‌ల్లో కొంతమంది సభ్యులతో కలిసి సింగిల్ ట్యాప్‌తో వెంటనే ఇంకో గ్రూప్ క్రియేట్ చేయొచ్చు. ఒక్కొక్కరిని కాకుండా.. ఒకేసారి అందరితో కొత్త గ్రూప్ క్రియేట్ చేయొచ్చన్నమాట. పుట్టినరోజులు వంటి సందర్భాల్లో అందులో ఒక్క సభ్యుడిని మినహా మిగిలినవారంతా ఏదైనా సర్‌ప్రైజ్ ప్లాన్ చేయాలన్నప్పుడు ఈ సిమిలర్ గ్రూప్ పనికొస్తుంది.

## దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన

# ఎంప్లాయర్ బ్రాండ్‌గా గూగుల్

## తర్వాతి స్థానాల్లో టాటా గ్రూప్, అమెజాన్




దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ఎంప్లాయర్ బ్రాండ్‌గా గూగుల్ అవతరించింది. ఈ జాబితాలో టాటా గ్రూప్, అమెజాన్ తర్వాతి స్థానాలను దక్కించుకున్నాయి. ఈ మేరకు హెచ్‌ఆర్ సేవల సంస్థ రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్-2026 నివేదిక వెల్లడించింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్, సమానత్వం, ఆకర్షణీయ వేతనం వంటి ఇతర ప్రయోజనాలను భారతీయ ఉద్యోగులు పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఆర్‌ఈబీఆర్-26 జాబితా ప్రకారం.. శాంసంగ్ ఇండియా 4, ఇన్ఫోసిస్ 5, రిలయన్స్ ఇండస్ట్రీస్ 6, ఐటీసీ గ్రూప్ 7, హిందూస్థాన్ యునిలీవర్ 8, మహీంద్రా అండ్ మహీంద్రా 9, డెల్ టెక్నాలజీస్ లిమిటెడ్ 10వ స్థానాలను ఆక్రమించాయి. ప్రపంచవ్యాప్తంగా 34 మార్కెట్లు కవర్ చేస్తూ.. దాదాపు 1.75 లక్షల మందిపై ర్యాండ్‌స్టాడ్ ఈ సర్వే నిర్వహించింది. భారత్ నుంచి 3,500 మందికిపైగా సర్వేలో పాల్గొన్నారు. ఇందులో 46 శాతం మంది ఆరునెలల్లో ఉద్యోగాలు మారనున్నారు.



# ఎయిరిండియా కొత్త సీఈఓగా టెవోల్డే గెబ్రెమరియం

టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియాకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్‌గా టెవోల్డే గెబ్రెమరియం నియమితులయ్యారు. సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఇథియోపియాకు చెందిన టెవోల్డే బాధ్యతలు స్వీకరించనున్నారు. 2022 నుంచి సీఈఓగా వ్యవహరిస్తున్న క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానాన్ని గెబ్రెమారియం భర్తీ చేయనున్నారు. గతంలో ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్‌నకు సీఈఓగా వ్యవహరించారు. కొత్త సీఈఓ నియామకానికి ప్రపంచవ్యాప్తంగా అనుభవజ్ఞులైన వ్యక్తులను పరిశీలించినట్లు ఎయిరిండియా ఓ ప్రకటనలో పేర్కొంది. టెవోల్డే గెబ్రెమరియం గతంలో ఇథియోపియన్ ఎయిర్‌లైన్‌ను ఆఫ్రికాలోనే అత్యంత లాభదాయక కంపెనీగా తీర్చిదిద్దినట్లు తెలిపింది. ఎప్పటి నుంచి బాధ్యతలు స్వీకరించేదీ త్వరలో వెల్లడిస్తామని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఆర్థిక నష్టాలను, కార్యాచరణ సవాళ్లను అధిగమించడానికి పూడ్చుకోవడానికి ఎయిరిండియా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో టెవోల్డే నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

# మహీంద్రా స్కార్పియో ఎన్ ఫేస్‌లిఫ్ట్ విడుదల




ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా అప్‌డేట్ చేసిన స్కార్పియో ఎన్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.13.69 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. టాప్ వేరియంట్ ధర రూ.25.49 లక్షలుగా పేర్కొంది. కొత్తగా పనోరమిక్ సన్‌రూఫ్, అతిపెద్ద ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సరౌండ్ వ్యూ కెమెరా వంటి ఫీచర్లను జోడించారు. మహీంద్రా స్కార్పియో ఎన్‌లో చూడటానికి దాదాపు పాత మోడల్‌నే పోలి ఉంటుంది. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో డ్యూయల్ టోన్ ఫినిష్‌తో వస్తోంది. లోపల 12.29 అంగుళాల ఫ్రీ-ఫ్లోట్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ ఇచ్చారు. 10.24 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. థార్ రాక్స్‌లోనూ ఇదే ఇన్ఫోటైన్‌మెంట్, డిజిటల్ క్లస్టర్‌ను గమనించొచ్చు. స్కార్పియో ఎన్‌లో బ్లైండ్ వ్యూ మానిటర్‌తో కూడిన 540 డిగ్రీల కెమెరా ఇచ్చారు. 12 స్పీకర్ సోనీ ఆడియో సిస్టమ్ ఉంది. వెంటిలేటెడ్ సీట్లు, ఆటో డిమ్మింగ్ ఐఆర్‌వీఎం, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, టైప్-సి ఛార్జర్, ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, లెవల్ 2 అడాస్ ఫీచర్లు వంటివి ఇందులో ఉన్నాయి. కొత్త స్కార్పియో 2.0 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్, 2.2 లీటర్ల mHawk డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తోంది. సిక్స్‌స్పీడ్ మాన్యువల్ లేదా సిక్స్ స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి రియర్ వీల్ డ్రైవ్, ఫోర్ వీల్ డ్రైవ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

ప్రభాతనవ
సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
10 ఆగస్టు 2026



# స్నేహ సొసైటీలో వైభవంగా బోనాల జాతర

**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 9 (సింగిడి):** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తారక రామ నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ స్ట్రక్షన్ వారి అంధుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో అంగరంగ వైభవంగా బోనాల జాతర కొనసాగింది. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్ స్ట్రక్షన్ భవనం నుండి సమీపంలోని పోలేరమ్మ ఆలయం వరకు బోనాలతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ బోనాల జాతర కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ జరీనా ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లు వివిధ వేషధారణలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసంలో శుక్రవారం చివరి రోజు కావడంతో బోనాల జాతర ఆకట్టుకుంది. ఈ బోనాలకు స్నేహ సొసైటీ కార్యదర్శి, ప్రిన్సిపాల్ ఎస్. సిద్దయ్య, ఎస్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ ఆషాడ మాసంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. స్నేహ సొసైటీలో గత 2014 నుండి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ పండుగగా బోనాలను జరుపుకుంటున్నారని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు. ఈ బోనాల కార్యక్రమంలో మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ కార్యవర్గ సభ్యులు వీరేశం, స్నేహ టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ మేనేజర్ శివ , ఎం అండ్ ఇ విజయ్ , జి ఎన్ ఎం మౌనిక , శివసత్తులు వంశీ ప్రియ, సూచి, లాస్య, పోతరాజు నరహరి బోనం ఎత్తగా ట్రాన్స్ మహిళలు జరీనా, శ్యామల స్నేహ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**కల్వకుర్తి ఆగస్టు 9 (సింగిడి)** కల్వకుర్తి నియోజక వర్గంలో నీ వివిధ మండలాలకు చెందిన అనారోగ్యంతో ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తున్న లబ్ధిదారులకు హైదరాబాద్‌లోని తమ నివాసంలో మండలాలకు చెందిన ముఖ్య నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు మరియు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ,లబ్ధిదారుల సంక్షేమం, ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం వెల్దండ మండలం లోని అజిలాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ సర్పంచి రమేష్ గౌడ్ తమ వార్డు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసి గ్రామ అభివృద్ధికి తోడ్పాటునందించాలని వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి మాజీ జెడ్పీటీసీ అశోక్ రెడ్డి,మాడుగుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు హరీష్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



# ఐక్యత ఫౌండేషన్ సహకారంతో తాగునీటి నాణ్యతకు చర్యలు

**కల్వకుర్తి ఆగస్టు 9 (సింగిడి)** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ మదాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మదాయి పల్లి గ్రామ సర్పంచ్ గుల్ల సుధాకర్, గ్రామ ఉప ఆంజనేయులు,గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్ష కాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు.ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండోజు అశోక్ చారి



**కల్వకుర్తి ఆగస్టు 9 (సింగిడి)** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్ చారి బాధ్యతలు స్వీకరించారు. సంస్థ జాతీయ ఛైర్మన్ నందన్ నరసింహ రావు ఆదేశాల మేరకు అశోక్ చారిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు.ఈ సందర్భంగా అశోక్ చారికి తుర్కలపల్లి గ్రామస్తులు, పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్న బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయడంతో పాటు, ప్రజలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలలు, పేదలు, అణగారిన వర్గాలు, నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంస్థ తరఫున చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అశోక్ చారి నాయకత్వంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని, ప్రతి జిల్లాలో సంస్థ కార్యకలాపాలను విస్తరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. బాధితులకు న్యాయం అందించడం, ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు, సామాజిక సమానత్వం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా అశోక్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ ఛైర్మన్ నందన్ నరసింహ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను మరింత విస్తరించి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పోలీసుల పని ఒత్తిడి, సైబర్ నేరాలపై జాతీయ సెమినార్

## పాల్గొన్న భద్రాద్రి జిల్లా ఆర్.ఎల్.డి పార్టీ నాయకులు... పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

**కొత్తగూడెం, ఆగస్టు 9 (సింగిడి)** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో లక్ష్యం సొసైటీ ఆధ్వర్యంలో పోలీస్ శాఖలో పని ఒత్తిడి, సైబర్ నేరాలపై ప్రత్యేక జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై ప్రసంగించారు.సెమినార్‌లో పోలీస్ శాఖలో సిబ్బంది ఎదుర్కొంటున్న పని ఒత్తిడి, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వారి సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తీర్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వక్తలు వివరించారు.





ముఖ్యంగా ఎవరూ తమ ఓటిపి లు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఇతర వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాపిల్ వై. దిలీప్ కుమార్, రిటైర్డ్ హర్యానా డీజీపీ, వివిధ రాష్ట్రాలకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, మాజీ డీజీపీలు పాల్గొన్నారు.రాష్ట్రీయ లోక్ దళ్ తరపున జిల్లా అధ్యక్షులు కట్టా సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షులు పృధ్వి నాయక్ పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలకు సురక్షితమైన సమాజాన్ని అందించడంలో పోలీస్ శాఖకు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని నాయకులు తెలిపారు.

# అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మెరిసిన నిజామాబాద్ క్రీడాకారులు

## క్రీడాకారులను అభినందించిన పోలీసు కమిషనర్

**నిజామాబాద్ ప్రతినిధి , ఆగస్టు 9 (సింగిడి) :** థాయిలాండ్‌లో జరిగిన 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ క్రీడాకారులు మెరిశారు. నిజామాబాద్, తెలంగాణ, భారతదేశానికి అపారమైన గౌరవాన్ని తీసుకువస్తూ బోధన్ రోడ్, ఎన్ఆర్ఐ కాలనీ లో ఉన్న తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా (టీఎంఏఏఐ) విద్యార్థులు థాయిలాండ్‌లోని పట్టాయాలో ఉన్న ఈస్టర్న్ నేషనల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక 9వ హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో 33 దేశాల నుండి 4403 కంటే ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనడంతో ఇది అత్యంత పోటీతో కూడిన ప్రపంచ తైక్వాండో ఈవెంట్లలో ఒకటిగా నిలిచింది. భారతదేశాన్ని ప్రతినిధ్యం వహిస్తూ టీఎంఏఏఐకి చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన





విద్యార్థులు మొత్తం 4 పతకాలు సాధించి విశేష విజయాన్ని నమోదు చేశారు: షేక్ మైతాబ్ అహ్మద్ (–81 కిలోలు) రెండు విభాగాల్లో పోటీ చేసి 1 బంగారు పతకం, 1కాంస్య పతకం గెలుచుకుని తన ప్రతిభను చాటాడు. షేక్ తల్హా (–41 కిలోలు) శక్తివంతమైన ప్రదర్శనతో ఒక వెండి పతకం సాధించాడు ఇల్హాన్ అబ్దుల్లా ఫారూకీ (–31 కిలోలు) అద్భుతమైన సంకల్పం, పోరాట స్ఫూర్తితో ఒక కాంస్య పతకం సాధించాడు. ఈ విశేష విజయాలు టీఎంఏఏఐలో డా. అబ్దుల్లా ఫారూకీ, అంతర్జాతీయ కోచ్, రిఫరీ, భారత గౌరవ రత్న సమ్మాన్ అవార్డు గ్రహీత మార్గదర్శకత్వంలో అందుతున్న క్రమశిక్షణ, అంకితభావం, ఉన్నత స్థాయి శిక్షణను ప్రతిబింబిస్తున్నాయి. ఆయన ఈ యువ ఛాంపియన్లను తీర్చిదిద్దడంలో, నిజామాబాద్‌ను అంతర్జాతీయ వేదికపై నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. నిజామాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత క్రీడాకారులను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సాదరంగా స్వాగతించి సన్మానించారు. ఆయన పతక విజేతలకు సర్టిఫికెట్లు అందజేసి వారి విజయాలను ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, ఆరోగ్యకరమైన విజయవంతమైన జీవితానికి శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, బలమైన భవిష్యత్తును నిర్మించడంలో కీలకమని నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ పేర్కొన్నారు. ముఖ్యంగా తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు ముందుకు వచ్చి చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ ఉప మేయర్ మీర్ మజాజ్ అలీ సాహెబ్ కూడా తమ నివాసంలో తైక్వాండో విద్యార్థులందరినీ సన్మానించి పతక విజేతలను అభినందించారు. నిజామాబాద్‌కు చెందిన ఈ క్రీడాకారులు భవిష్యత్తులో ఇన్‌షా అల్లాహ్ ఆసియా ఒలింపిక్ పతకాలను సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ యువ క్రీడాకారుల విజయాలు వారి తల్లిదండ్రులు, తైక్వాండో సమాజం, మొత్తం నిజామాబాద్ జిల్లాకు అపారమైన ఆనందం, గర్వాన్ని కలిగించాయి. ఈ విజయం కష్టపడి పని చేయడం, అంకితభావం, పెరుగుతున్న క్రీడా సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ విజయం నిజామాబాద్ , తెలంగాణకు గౌరవాన్ని మాత్రమే కాకుండా ప్రపంచ తైక్వాండో వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత బలపరుస్తుందన్నారు.

# పింఛన్లకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి

## సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి ఆగస్టు 9 (సింగిడి)** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది కాబట్టి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి అని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒంటరి మహిళలు,వితంతువులు,గీత,చేనేత కార్మికులు , పైలేరియా,బోదకాలు , డయాలసిస్ బాధితులు దివ్యాంగుల కేటగిరిలో థాలసీమియా,సికిల్ సెల్ ,హిమోఫిలియా బాదితులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆదేశించింది అన్నారు.ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల మంజూరు ఏర్పాట్లు చేయడం జరిగింది అని పెన్షన్లకు ఒక లక్ష యాభై వేలు పట్టణాల్లో రెండు లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారు అర్హులు. ఏడున్నర ఎకరాల కంటే ఎక్కువ మెట్ట పొలం ఉన్నవారు అనర్హులు. ప్రభుత్వ రంగ, ప్రైవేటు,ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు డాక్టర్లు ,కాంట్రాక్టర్లు, వృత్తి నిపుణులు ఆయిల్ మరియు రైస్ మిల్లులు ,పెట్రోల్ పంపులు ,రిగ్ యజమానులు వారి తల్లిదండ్రులు అనర్హులు . ఇప్పటికే ప్రభుత్వం లేదా స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ పొందుతున్న వారు నాలుగు చక్రాల వాహనాలు లేదా భారీ వాహనాలు ఉన్నవారిని అనర్హులుగా పరిగణిస్తారు.అని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అన్నారు.గతంలో దరఖాస్తు చేసి ఉన్నవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని అయితే తమరు దరఖాస్తులు ఉన్నాయో లేదో పంచాయతీ కార్యదర్శిలు వార్డు అధికారుల ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. కొత్తవారు దరఖాస్తు చేయుట వెబ్సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకోవాలి అని దానిని నింపిన తర్వాత గ్రామంలోని పంచాయతీ కార్యదర్శి కి ఆ దజేయాలని సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

# సీనియర్ కార్మిక, దళిత నాయకుడు పిటి నాయుడు మృతి

## ఆయన సేవలు చిరస్మరణీయం, చారిత్రాత్మకం: ఆచార్య డా. మద్దెల శివకుమార్





**కొత్తగూడెం, ఆగస్టు 9(సింగిడి)** సీనియర్ సింగరేణి ట్రేడ్ యూనియన్ నాయకుడు, సీనియర్ దళిత నాయకుడు స్వర్గీయ పిటి నాయుడు (79) ఆకస్మిక మరణం పట్ల పట్టణ ప్రముఖులు, వివిధ కార్మిక, దళిత సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఆయన మృతి చెందగా, ఖమ్మం నుంచి భౌతికకాయాన్ని కొత్తగూడెం బాబు క్యాంపులోని స్వగృహానికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కవి, సినీగీత రచయిత, గాయకులు, సమాజసేవకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన బృందంతో కలిసి పిటి నాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. హాజరైన వారంతా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగిగా పని చేస్తూనే సీనియర్ ఐఎన్‌టీయూసీ నాయకుడిగా, హెచ్ఎంఎస్ నాయకుడు స్వర్గీయ జాడి దుర్గయ్య నాయకత్వంలో కీలక పాత్ర పోషించిన పిటి నాయుడు సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్న ఆయన సీనియర్ దళిత సంఘాల నాయకుడిగా కూడా సేవలందించారని తెలిపారు. కొత్తగూడెం ముద్దుబిడ్డగా, స్వర్గీయ కొప్పుల వెంకటేశ్వరరావు ఎమ్మెల్సీకి ముఖ్య అనుచరుడిగా, కొత్తగూడెం నిర్మాణ ప్రస్థానంలో ఒక పోరాట యోధుడిగా పిటి నాయుడు చేసిన సేవలు చారిత్రాత్మకమైనవని శివకుమార్ కొనియాడారు. పిటి నాయుడు గత పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ నెల 8న ఉదయం ఆకస్మికంగా మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుమారు ఆరేళ్ల క్రితం మణుగూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ఏకైక కుమారుడు, కోడలు మృతి చెందడం కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిందని తెలిపారు.ఈ సంతాప కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జెబి శౌరి, ఐఎన్‌టీయూసీ సింగరేణి ఏరియా కార్యదర్శి రజాక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతోటి పాల్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, పెయింటర్ ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంఏ రజాక్, సీనియర్ సీపీఐ నాయకులు మాతంగి లింగయ్య, దళిత సంఘాల జిల్లా నాయకులు సుబ్బారపు మధుసూదన్ చిన్ని, కూర రవీందర్, బ్రదర్ బీరమోహనరావు, భూపతి అశోక్, మచ్చ పృథ్వీరాజ్, కనుకుంట్ల బాబన్న తదితరులు పాల్గొని నివాళులర్పించారు.అలాగే కండక్టర్ ప్రసాద్, మెకానిక్ వెంకట్, రాము, రాజేశ్వరరావు, సాయి కుమార్, శ్యామ్, సీఎస్ఐ చర్చి పాస్టర్లు, కమిటీ సభ్యులు, స్త్రీల కూటమి సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శతచండీ యాగంతో ఇందూరు పావనం





## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 9 (సింగిడి) : శత చండీయాగంతో ఇందూరు పావనమైందని, లోక కళ్యాణార్థం యాగం చేయడం అద్భుతమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన శత చండీయాగం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ యాగంతో ఎల్ నినో పరిస్థితులను అధిగమించి మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల యాగం ఫలితం మొదటి రోజే చూశామని సమృద్ధిగా వర్షం కురిసిందని గుర్తు చేశారు. రైతు బాగుంటే అందరూ బాగుంటారని, దేశం బాగుంటుందన్నారు. హిందూ ధర్మంలో మాత్రమే "సర్వే జన సుఖినో భవంతు" అని అంటారని, అందరి కోసం వేడుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానంగా యాగం నిర్వహణకు కృషి చేసిన అన్ని సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, మర్చంట్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవంబర్‌లో కొత్తగూడెంలో ఐలు రాష్ట్ర 4వ మహాసభలు

## మణుగూరులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయం

**కొత్తగూడెం, ఆగస్టు 9(సింగిడి)** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను నవంబర్ నెలలో కొత్తగూడెంలో నిర్వహించాలని నిర్ణయించారు. శనివారం కొత్తగూడెంలో జరిగిన ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఎల్లందు, దమ్మపేట ప్రాంతాలకు చెందిన 24 మంది జిల్లా కోర్టు కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ఇదే సమావేశంలో ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలను మణుగూరులో నిర్వహించాలని నిర్ణయించారు.సమావేశానికి ఐలు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నర్సయ్య






అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఐలు జిల్లా అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కే. పార్థసారధి, తెలంగాణ బార్ కౌన్సిల్‌కు నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఐలు మహిళా వింగ్ కన్వీనర్ చందాల శైలజ, ఐలు నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, జలసూత్రం శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, ఐలు సంస్థాగత బలోపేతం, రాబోయే రాష్ట్ర, జిల్లా మహాసభల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని కోర్టు కమిటీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.సమావేశంలో ఐలు జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, రాష్ట్ర కమిటీ కార్యదర్శి పానుగోటి కిషన్ రావు, కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావిలాల రామారావు, కిలారు పురుషోత్తం, మణుగూరు కోర్టు కమిటీ అధ్యక్షుడు పోషం భాస్కర్, దమ్మపేట కోర్టు ఐలు బాధ్యులు వుండతానేని శ్రీనివాసరావు, మారం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఐలు జిల్లా కమిటీ సభ్యులు అరికల రవికుమార్, గడదేసి కాంతయ్య, జి. అన్నపూర్ణ, టి. సునంద, తెల్లబోయిన రమేష్, ఉప్పు అరుణ్, పిట్టల రామారావు, దూదిపాల రవికుమార్, మేదరమెట్ల శ్రీనివాసరావు, పద్మావతి, శైలజ తదితరులు హాజరయ్యారు



# చెరువులు, వాగుల ఆక్రమణలు

## వరదలకు అసలు కారణం ఎవరు?

ప్రకృతి విపత్తా.. మనిషి చేసిన తప్పిదమా?

**వర్షం కురవడం ప్రకృతి సహజం. వర్షపు నీరు ప్రవహించడం కూడా సహజమే. కానీ ఆ నీరు వెళ్లాల్సిన దారులు కనిపించకుండా పోయినప్పుడు మాత్రం వరదలు విపత్తుగా మారతాయి. పట్టణాలు, గ్రామాల్లో ప్రతి వర్షా కాలంలో రోడ్లు జలమయం కావడం, ఇళ్లు నీట మునగడం, రాకపోకలు స్తంభించడం చూస్తూనే ఉన్నాం. దీనికి భారీ వర్షాలే కారణమని చెప్పడం సులభం. కానీ అసలు ప్రశ్న ఏమిటంటే... వర్షపు నీటికి సహజంగా ఉన్న మార్గాలను మనమే మూసివేశామా?**

ఎడిటోరియల్

చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు ఒక ప్రాంతానికి సహజమైన నీటి పారుదల వ్యవస్థ. వర్షం పడినప్పుడు నీటిని నిల్వ చేయడం, అదనపు నీటిని మరో ప్రాంతానికి మళ్లించడం వీటి ప్రధాన ఉద్దేశం. ఒకప్పుడు గ్రామాల అభివృద్ధి చెరువుల చుట్టూనే ఉండేది. కానీ కాల క్రమేణా పట్టణీకరణ పెరగడంతో చెరువు శిఖం భూములు, వాగుల పరివాహక ప్రాంతాలు, కాలువల మార్గాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇళ్ల నిర్మాణం, వ్యాపార సముదాయాలు, రహదారులు, ఇతర నిర్మాణాల కోసం నీటి ప్రవాహ మార్గాలను కుదించడం వల్ల చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వర్షపు నీటికి దారి లేకపోతే అది ఎక్కడికి వెళుతుంది? చివరకు రోడ్లపైకి, ఇళ్లలోకి, పంట పొలాల్లోకి చేరుతుంది. అప్పుడు ప్రకృతిని నిందించడం ఎంతవరకు సమంజసం?

**చెరువు కేవలం నీటి నిల్వ కాదు**

చెరువు అంటే కేవలం సాగునీటి వనరు కాదు. అది ఒక ప్రాంతానికి సహజమైన వరద నియంత్రణ వ్యవస్థ. భారీ వర్షం వచ్చినప్పుడు కొంత నీటిని చెరువు స్వీకరిస్తుంది. చెరువులు ఆక్రమణలకు గురైతే వాటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా కొద్దిసేపు కురిసిన భారీ వర్షానికే చెరువులు నిండిపోయి నీరు బయటకు పొంగే ప్రమాదం పెరుగుతుంది. ఇదే పరిస్థితి వాగుల విషయంలోనూ కనిపిస్తోంది. వాగు ప్రవహించే మార్గంలో నిర్మాణాలు జరిగితే నీరు తన సహజ మార్గాన్ని వదిలి ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కుంటుంది. ఆ ప్రత్యామ్నాయ మార్గం మనిషి నివాస ప్రాంతం అయితే నష్టం తప్పదు.

**బాధ్యత ఎవరిది?**

చెరువులు, వాగుల ఆక్రమణలకు కేవలం ఆక్రమణదారులనే నిందించడం సరిపోదు. అక్రమ నిర్మాణాలు ఎలా జరిగాయి? అనుమతులు ఎవరు ఇచ్చారు? నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన వ్యవస్థ ఎక్కడ విఫలమైంది? అనే ప్రశ్నలకు కూడా సమాధానం కావాలి. ప్రజలు కూడా బాధ్యత వహించాలి. ప్రభుత్వ భూమి, చెరువు భూమి, వాగు పరిధిలో స్థలం లభిస్తే చాలు నిర్మాణం చేసేయాలనే ఆలోచన ప్రమాదకరం. భవిష్యత్తులో తమ పిల్లలు ఎదుర్కొనే సమస్యలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి.

**వరదల తర్వాత కాదు.. ముందే చర్యలు**

ప్రతి ఏడాది వర్షాలు వచ్చిన తర్వాత అధికారులు హడావుడిగా కాలువలు శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం, నీరు తొలగించడం వంటి తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. ఇవి అవసరమే. కానీ శాశ్వత పరిష్కారం కాదు.

ప్రతి పట్టణం, ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు, వాగులు, కాలువల పూర్తి మ్యాపింగ్ చేయాలి. వాటి అసలు హద్దులను గుర్తించి, ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించాలి. వర్షపు నీరు వెళ్లే సహజ మార్గాలను పునరుద్ధరించాలి. చెరువుల పూడిక తీత, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతేకాదు.. కొత్తగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో భవిష్యత్తులో వర్షపు నీటి ప్రవాహంపై ప్రభావం ఏమిటన్నది తప్పనిసరిగా పరిశీలించాలి. అభివృద్ధి అవసరమే కానీ, ప్రకృతి మార్గాలను ధ్వంసం చేసి చేసే అభివృద్ధి చివరకు విధ్వంసానికే దారితీస్తుంది.

**ప్రకృతిని నిందించే ముందు మనల్ని మనం ప్రశ్నించుకోవాలి**

వాతావరణ మార్పుల కారణంగా భారీ వర్షాలు పెరగవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు భవిష్యత్తులో మరింత పెరగవచ్చు. ఈ వాస్తవాన్ని అంగీకరించి పట్టణ ప్రణాళికలను మార్చుకోవాలి.వరదలు వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం కంటే వరదలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వానికి తక్కువ ఖర్చుతో కూడిన, ప్రజలకు సురక్షితమైన మార్గం. చెరువులు, వాగులు, కాలువలను కాపాడటం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం కాదు.. మన పట్టణాలను, మన గ్రామాలను, మన భవిష్యత్తును కాపాడటం. అందుకే ఇకనైనా ప్రతి భారీ వర్షం తర్వాత "ఇంత వర్షం ఎప్పుడూ పడలేదు" అని చెప్పడం కాకుండా... "వర్షపు నీరు వెళ్లాల్సిన దారిని మనం ఎందుకు కాపాడుకోలేకపోయాం?" అని ప్రశ్నించుకోవాలి.

వరదలకు వర్షం కారణం కావచ్చు.. కానీ వరద నష్టానికి మన నిర్లక్ష్యం కారణం కాకూడదు.



ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170

# "అరణ్య హృదయ స్పందన-సింహగర్జన"



**ఆగస్టు 10... ప్రపంచ సింహాల దినోత్సవం**

**ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం సింహాల తగ్గుతున్న జనాభాపై ప్రపంచ దృష్టిని సారించడం, వాటి నివాస ప్రదేశాలను కాపాడటం, అక్రమ వేటను నియంత్రించడం, ప్రజల్లో అవగాహన పెంచడం. సింహాలు ఒకప్పుడు యూరప్ దక్షిణ భాగం, మధ్య ప్రాచ్యం, ఆసియా, ఆఫ్రికా ఖండాల విస్తార ప్రాంతాల్లో సంచరించేవి. 10,000 సంవత్సరాల క్రితం సింహాల విస్తృతి ప్రపంచంలో అతి విస్తారమైనదిగా ఉండేది. కానీ మానవ జనాభా పెరుగుదల, భూభాగ ఆక్రమణ,** నష్టం, మానవ-వన్యప్రాణి ఘర్షణ, అక్రమ వేట, ఆహార కొరత, పశువుల ద్వారా వ్యాపించే రిండర్ పెస్ట్, డిస్టెంపర్ వంటి వ్యాధులు. వ్యవసాయం, పట్టణీకరణ, గనుల తవ్వకం కారణంగా పచ్చిక మైదానాలు, అటవీ ప్రాంతాలు తగ్గిపోవడం సింహాల సంచారానికి అడ్డంకి అయింది. పశువులను దాడి చేసినందుకు గ్రామస్థులు సింహాలను చంపడం మానవ-సింహ ఘర్షణలను పెంచింది. చర్మం, ఎముకలు, గోర్లు కోసం జరుగుతున్న అక్రమ వేట సింహాల ప్రాణాలకు భయంకర ముప్పుగా మారింది.

సింహం పర్యావరణ సమతుల్యంలో కీలక పాత్ర పోషించే "కీ స్టోన్ స్పీసీస్". ఆహార శృంఖలలో అగ్రస్థానంలో ఉండి మృగాల సంఖ్యను నియంత్రించడం ద్వారా పచ్చిక మైదానాలు, అటవీ వ్యవస్థలు సమతుల్యంగా ఉంచుతుంది. సింహాల సంఖ్య తగ్గిపోతే ఈ సమతుల్యం కూలిపోవడంతో పర్యావరణ సంక్షోభం తలెత్తుతుంది. సింహం కేవలం ఒక జంతువు మాత్రమే కాదు, మానవ నాగరికతలో అపూర్వమైన సాంస్కృతిక స్థానం కలిగిన ప్రతీక. భారతీయ సంస్కృతిలో విష్ణువు నరసింహావతారం ధర్మ రక్షణకు చిహ్నం. దుర్గాదేవి సింహ వాహనంగా శక్తి, ధైర్యానికి ప్రతీక. అశోక స్తంభంలోని నాలుగు సింహాల శిల్పం భారత జాతీయ చిహ్నంగా సత్యం, ఏకత్వం, శక్తిని ప్రతిబింబిస్తుంది. కాకతీయుల రామప్ప ఆలయం, హంపి శిల్పాలు, ఖజురాహో గోపురాలు, ఇతర శిల్పకళాకృతుల్లో సింహం శౌర్య చిహ్నంగా అంకితమై ఉంది.

సింహాల రక్షణ కోసం అనేక దేశాలు, సంస్థలు కృషి చేస్తున్నాయి. భారత దేశంలో 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద గిర్ సింహాల రక్షణ కఠినంగా అమలు అవుతోంది. గుజరాత్ ప్రభుత్వం పర్యవేక్షణ, ఆరోగ్య పరీక్షలు, అగ్ని నియంత్రణ, నీటి వనరుల అభివృద్ధి వంటి చర్యలు చేపడుతోంది. ఆఫ్రికాలో లయన్ రికవరీ ఫండ్, బోర్న్ ఫ్రీ ఫౌండేషన్, పాంథెరా వంటి సంస్థలు నివాస ప్రదేశాల పునరుద్ధరణ, అక్రమ వేట నిరోధం, స్థానిక సమాజాల భాగస్వామ్యం పెంపు కోసం కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో CITES కింద సింహ భాగాల వాణిజ్య నియంత్రణ, IUCN "Vulnerable" జాబితాలో చేర్చడం వంటి చర్యలు చేపట్ట బడ్డాయి. పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక గ్రామస్థులకు సింహాల రక్షణతో ఉపాధి కల్పించడం, మానవ-సింహ ఘర్షణలను తగ్గించడంలో సహకరిస్తోంది.

సింహాల గర్జన భవిష్యత్తులోనూ అరణ్యాలను నింపాలంటే ప్రభుత్వాలు, పర్యావరణ సంస్థలు, శాస్త్రవేత్తలు, స్థానిక సమాజాలు, ప్రతి పౌరుడు సమన్వయంతో పనిచేయాలి. సింహాన్ని రక్షించడం అంటే కేవలం ఒక జాతిని కాపాడటం కాదు—భూమి పర్యావరణ సమతుల్యాన్ని, మానవ నాగరికత గౌరవాన్ని, భవిష్యత్తు తరాల జీవనాధారాన్ని కాపాడటం. సింహం గర్జన నిలిస్తే అది కేవలం అరణ్యపు నిశ్శబ్దం మాత్రమే కాదు, ప్రకృతి గుండె చప్పుడే ఆగిపోవడం. అందువల్ల ప్రపంచ సింహాల దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేయవలసింది ఒక్కటే—సింహాన్ని, దాని నివాసాన్ని, దాని గౌరవాన్ని రక్షించడం మన అందరి బాధ్యత.

**ప్రపంచ సింహాల దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 10న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. అరణ్యానికి రాజుగానే కాక శౌర్యం, ధైర్యం, మహోన్నతానికి ప్రతీకగా నిలిచిన సింహాన్ని రక్షించాలనే సంకల్పాన్ని గుర్తుచేసే ఈ దినోత్సవం 2013లో నేషనల్ జియోగ్రాఫిక్ అన్వేషకులు డెరెక్ జౌబర్ట్ మరియు బేవర్లీ జౌబర్ట్ ప్రారంభించిన "బిగ్ క్యాట్ ఇనిషియేటివ్"లో భాగంగా ఆవిర్భవించింది.**

**వేట, పర్యావరణ మార్పుల కారణంగా అవి క్రమంగా తగ్గిపోతూ, నేటికి కేవలం ఆఫ్రికా సబ్ సహారా ప్రాంతాలు, భారత దేశంలోని గుజరాత్ రాష్ట్ర గిర్ అరణ్యం, కొన్ని రక్షిత ప్రాంతాల్లో మాత్రమే మిగిలాయి.**

గత 100 సంవత్సరాల్లో సింహాల నివాస భూభాగం 90% వరకు నష్టపోగా, గత 20 ఏళ్లలో సింహాల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా సుమారు 40% తగ్గిపోయింది. 2023 నాటికి ఆఫ్రికాలో సుమారు 20,000 సింహాలు మాత్రమే మిగిలి ఉండగా, ఆసియా సింహాలు కేవలం గిర్ అరణ్యంలో 675 మాత్రమే ఉన్నాయని గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది. సింహాల పుట్టినపుడు జీవించే అవకాశం కేవలం 50% మాత్రమే ఉండటం, వాటి రక్షణను మరింత క్లిష్టం చేస్తోంది. ఈ క్షీణతకు ప్రధాన కారణాలు నివాస ప్రదేశాల

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...
9440595494

# ఇంధన భద్రతకు బయోఫ్యుయల్స్ ఊతం

## (10 ఆగష్టు "ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం" సందర్భంగా)

బయోఫ్యుయల్' లేదా 'జీవ ఇంధనం' అనే పదం 'బయోమాస్' నుంచి ఆవిర్భవించింది. జంతు వ్యర్థాలు, వ్యవసాయ అవశేషాలు, మొక్కలు, ఆల్గేలతో పాటు పునరుత్పాదక జీవ వనరుల నుండి ఉత్పత్తి చేసిన ఇంధనాలను "బయో ఫ్యుయల్స్" లేదా "జీవ ఇంధనాలు" అంటాం. సౌర, పవన, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వనరుల సవాళ్లకు సరైన సమాధానంగా జీవ ఇంధనాలు పరిష్కారాలను అందిస్తున్నాయి. జీవ ఇంధనాల్లో ముఖ్యమైనదిగా 'బయోడీజిల్'ను గుర్తిస్తున్నారు. కూరగాయల నూనెలు, జంతువుల కొవ్వులు వంటి పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పత్తి చేయబడిన ద్రవ ఇంధనమే బయోడీజిల్ అని పిలువబడుతున్నది. పెట్రోల్ లేదా డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా బయోడీజిల్ వాడబడుతున్నది. చక్కెర, స్టార్చ్, కూరగాయల నూనె, ఆల్గల్ బయోఫ్యుయల్, బయోబ్యుటనాల్, వుడ్ – పెల్లెట్ ఫ్యుయల్, జంతువుల కొవ్వుల లాంటి ఆహార వనరుల నుంచి ఉత్పత్తి చేయబడిన బయో ఇంధనాల్లో బయోడీజిల్, బయో ఇథనాల్ (ఆల్కహాల్), బయోగ్యాస్, బయోహైడ్రోజన్, కూరగాయల నూనె, బయోఈథర్, బయోమాస్ లాంటివి వస్తాయి. జీవ ఇంధనాల ప్రాధాన్యం పట్ల అవగాహన కలిగించడానికి ప్రతి ఏటా 10 ఆగస్టు రోజు "ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం (వరల్డ్ బయోఫ్యుయల్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది.

**బయోఫ్యుయల్స్ తయారీ కేంద్రంగా యూఎస్:**

నేడు అమెరికా అతి పెద్ద బయో ఇంధన ఉత్పత్తిదారుగా నిలుస్తున్నది. బయో ఇంధనాలకు భారతదేశంలో ఆశాజనకమైన ఉజ్వల భవిష్యత్తు ఉన్నది. వాతావరణ ప్రతికూల మార్పులు, హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడానికి శిలాజ ఇంధనాలకు తగిన ప్రత్యామ్నాయంగా



బయోఫ్యుయల్స్ నిలుస్తున్నాయి. జీవ ఇంధనాలను రవాణా, హీటింగ్, విద్యుత్తు ఉత్పత్తులకు ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ లేదా పరిశ్రమల వ్యర్థాలు, వ్యాపారాలు, మునిసిపాలిటీల నుంచి ఉత్పన్నం అవుతున్న సేంద్రీయ వ్యర్థాల నుంచి బయో ఇంధనాలను తయారు చేయడం వల్ల వాతావరణ సానుకూల మార్పులకు కూడా అవకాశం ఉంటుంది. శిలాజ ఇంధనాలతో పోల్చితే పర్యావరణ హిత ప్రత్యామ్నాయ ఇంధనాలుగా జీవ ఇంధనాలను వాడకం క్రమంగా పెరుగుతోంది.

**పలు రకాల జీవ ఇంధనాలు - ప్రధాన ప్రయోజనాలు:**

సాంప్రదాయ బయో ఫ్యుయల్స్ వనరులుగా చక్కెర, కూరగాయల నూనెలు, జంతు కొవ్వులు వాడడం అనాదిగా జరుగుతున్నది. మొదటి తరం బయోఫ్యుయల్స్‌గా బయోడీజిల్, వెజిటెబుల్ ఆయిల్, బయోమాస్ వినియోగం జరుగుతున్నది. రెండవ తరం బయోఫ్యుయల్స్‌గా వ్యవసాయ లేదా ఇతర వ్యర్థాల నుంచి తయారు చేస్తున్న ఇథనాల్, బయోడీజిల్ లాంటివి వాడబడుతున్నాయి. మూడవ తరం బయోఫ్యుయల్స్‌లో ఆల్గేల నుంచి తయారు చేసే బ్యుటనాల్, నాలుగవ తరంలో జెనెటిక్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో తయారు చేసే జీవ ఇంధనాలు వస్తాయి. జీవ ఇంధనాలను రవాణా, విద్యుత్తు ఉత్పత్తి, హీటింగ్ (వుడ్ పెలెట్స్), పరిశ్రమలు, ఏవియేషన్(బయో జెట్ ఫ్యుయల్), వ్యవసాయం (బయో మాస్), సముద్ర రవాణా (బయో డీజిల్/ఇథనాల్) లాంటి రంగాలు వినియోగిస్తున్నాయి. పునరుత్పాదక, కార్బన్ లేదా గ్రీన్ హౌజ్ వాయు ఉద్గార రహిత, శక్తి భద్రత కలిగిన, వ్యర్థాల వినియోగం, ఉద్యోగ కల్పన, అందుబాటులో వనరులు, ఆర్థికాభివృద్ధి లాంటి పలు ప్రయోజనాలను కల్పిస్తున్న జీవ ఇంధనాలను ప్రోత్సహించాల్సిన అగత్యం ఏర్పడిందని గమనించాలి.

శిలాజ ఇంధనాలతో పోల్చితే వాతావరణ సానుకూల జీవ ఇంధనాల ఉత్పత్తి పట్ల ప్రభుత్వాలు చొరవ తీసుకోవలసి ఉన్నది. తరగని ఇంధన వనరులతో పాచు బయో ఫ్యుయల్స్ వాడకాన్ని, ఉత్పత్తులను పెద్ద ఎత్తున చేపట్టవలసి ఉన్నది వ్యవసాయ వ్యర్థాలను సాగు క్షేత్రాల్లో కాల్చడానికి బదులుగా బయో ఫ్యుయల్స్ తయారీలకు వినియోగించడం సముచితంగా ఉంటుందని గమనిద్దాం, భారత్‌లో కూడా పెద్ద ఎత్తున జీవ ఇంధనాలను ఉత్పత్తి చేద్దాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700047

# పిల్లల ఆరోగ్య రక్షణకు సమష్టి యజ్ఞం... జాతీయ నులిపురుగుల నిర్మూలనం

**జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 10న దేశ వ్యాప్తంగా పాటించబడే ఒక సమగ్ర ఆరోగ్య యజ్ఞం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రణాళిక మాత్రమే కాదు, భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతకు పునాది వేసే జాతీయ సంకల్పం. పేగుల్లో నివసించే నులి పురుగులు లేదా పరాన్న జీవులు పిల్లల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ప్రధాన కారణాలలో ఒకటి. కలుషితమైన నీరు, పరిశుభ్రత లేని ఆహారం, మట్టి ద్వారా ఇవి పిల్లల శరీరంలోకి ప్రవేశించి, ఎదుగుదలకు కావలసిన పోషకాలను తినేసి బలహీనత, పోషకాహార లోపం, రక్తహీనత వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తాయి.**



గుండ్రటి పురుగులు, కొక్కెం పురుగులు, చాబుకపు పురుగులు భారతదేశంలో ఎక్కువగా కనిపించే రకాలుగా గుర్తించబడ్డాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 బిలియన్ మంది నులి పురుగుల బారిన పడ్డారు. ఇందులో పెద్ద భాగం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలే. భారతదేశంలో 2022 నాటికి సుమారు 22 కోట్ల పిల్లలు నులి పురుగుల ప్రభావానికి లోనవుతుండగా, వీరిలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల వారే. ఈ సమస్యను నిర్మూలించేందుకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2015లో జాతీయ స్థాయిలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదీల్లో రెండు విడతలుగా ఈ కార్యక్రమం అమలవుతోంది. ఆల్బెండజోల్ అనే సురక్షితమైన మందును పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు. 2023లో మాత్రమే సుమారు 26.3 కోట్ల పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేయ బడ్డాయి, ఇది లక్ష్య జనాభాలో 94 శాతం కవరేజీగా గుర్తించ బడింది.

నులి పురుగుల వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల లోపం, బరువు తగ్గడం, మానసిక అలసట, పాఠశాల హాజరు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఒక అధ్యయనం ప్రకారం, నులి పురుగుల బారినపడ్డ పిల్లల్లో విద్యా సంబంధ పనితీరు సగటున 20 శాతం వరకు పడిపోతుంది. కాబట్టి ఈ సమస్యను నిర్మూలించడం విద్యా అభివృద్ధి, శారీరక–మానసిక శ్రేయస్సు, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కీలకం.

నులి పురుగుల నిర్మూలనతో పాటు, నులి పురుగుల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధుల నియంత్రణకూ ఇది పరోక్షంగా తోడ్పడుతుంది. 1953లో ప్రారంభమైన జాతీయ మలేరియా నియంత్రణ కార్యక్రమం, తరువాతి దశల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సమగ్ర దోమ నియంత్రణ చర్యలు ఈ దిశగా పెద్ద మార్పు తీసుకు వచ్చాయి. గత పది సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా మలేరియా కేసులు 85 శాతం తగ్గాయి. అయినప్పటికీ డెంగ్యూ, చికున్ గున్యా వంటి వైరల్ వ్యాధులు పట్టణాల్లో ఇంకా విస్తృతంగా ఉన్నాయి. కాబట్టి నీటి నిల్వలను తొలగించడం, మురుగు నీటి కాలువలు, గుంతలను శుభ్రపరచడం, నిల్వ నీటిలో లార్వా తినే చేపలను వదలడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన రసాయనాలతో పిచికారీ చేయడం, దోమ తెరలు, దోమల నివారణ క్రీములు ఉపయోగించడం వంటి చర్యలు నిరంతరంగా అమలవ్వాలి.

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రతి కుటుంబం పరిశుభ్రతను జీవన విధానంగా అలవర్చు కోవాలి. తాగే నీరు మరిగించి తాగడం, ఆహారం తినే ముందు చేతులు సబ్బుతో కడుక్కోవడం, పండ్లు–కూర గాయలను శుభ్రంగా కడిగి తినడం, కాలుష్యం ఉన్న ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవక పోవడం వంటి అలవాట్లు నులి పురుగుల వ్యాప్తిని గణనీయంగా తగ్గిస్తాయి. అదేవిధంగా ప్రతి వారం ఒకరోజు "డ్రై డే" పాటించి నిల్వ నీటిని తొలగించడం, పాఠశాలలు–కాలనీల్లో అవగాహన సమావేశాలు నిర్వహించడం, ఆరోగ్య సిబ్బందికి సహకరించడం ప్రజల బాధ్యత.

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఒక రోజు జరిపే కార్యక్రమం మాత్రమే కాదు; ఇది నిరంతర ఆరోగ్య పోరాటం. పిల్లల ఆరోగ్యం మెరుగు పడితేనే దేశం భవిష్యత్తు బలపడుతుంది. చిన్న పరిశుభ్రత అలవాట్లు, సకాలంలో ఔషధం వాడకం, సామూహిక సహకారం కలిసివస్తే నులి పురుగులను నిర్మూలించడం సాధ్యమే. ఆరోగ్యవంతమైన పిల్లలు, శక్తివంతమైన యువత తోనే దేశం నిజమైన అభివృద్ధి మార్గంలో పయనిస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494



## ఆ రోజు ఫొటో దిగడం

# అవ్వలేదు..

## ఈరోజు కలిసి నటించా: మమితా బైజు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఈ నెల 14 గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన టీమ్.. వరుస ఇంటర్వ్యూలతో సందడి చేస్తున్నారు. అలాగే తాజాగా గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సంద ర్భంగా సూర్యతో కలిసి నటించడం నా అదృష్టం అంటూ చెప్పుకొచ్చింది మమిత. ఈ మేరకు మమితా బైజు మాట్లాడుతూ.. 'సూర్య సార్, మీకు గుర్తుందో లేదో.. 2015లో ఒక కార్యక్రమం కోసం మీరు 'లులు మాల్'కు వచ్చారు. అప్పుడు నేను 8వ తరగతి, మా అన్నయ్య 11వ తరగతి చదువుతున్నాం. మిమ్మల్ని కలవాలని నాకు చాలా ఆశగా ఉండేది, కానీ మా అమ్మానాన్నలు నన్ను అనుమతించలేదు. మా అన్నయ్య, అతని స్నేహితులు వెళ్లి మీతో ఫోటో దిగి నాకు చూపించారు.. అప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది.. కానీ ఈ రోజు.. అదే లులు మాల్‌లో.. మీతో కలిసి నటించే అవకాశం రావడం నాకు నిజంగా గొప్ప అదృష్టం.. ఒక అభిమానిగా, నిండు మనసుతో చెబుతు న్నాను' అంటూ తన ఆనం దాన్ని వ్యక్తం చేసింది మమిత.

సెయాన్' లో మైండ్ బ్లోయింగ్ యాక్షన్ సీన్స్..
శివకార్తీకేయన్ కోసం రంగంలోకి

# పాపులర్ ఫైట్ మాస్టర్స్!

శివకార్తీకేయన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సెయాన్'. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రూరల్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను కమల్ హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్స్‌పై కమల్ హాసన్, మహేంద్రన్ నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్లు విడుదల అయి భారీ హైప్ క్రియేట్ అయింది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన లేటెస్ట్ అప్‌డేట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ మూవీ తదుపరి కొత్త షూటింగ్ షెడ్యూల్ వచ్చే వారం నుంచే అత్యంత వేగంగా ప్రారంభం కాబోతున్నట్లు టాక్. ఈ క్రమంలోనే సినిమాలోని అత్యంత కీలకమైన పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్సులను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందట.

అయితే ఈ సినిమా కోసం టాలెంటెడ్ అండ్ పాపులర్ స్టంట్ మాస్టర్స్ అన్బరివ్ రంగంలోకి దింపుతుండటం విశేషం. ఈ చిత్రంలో



శివకార్తికేయన్‌పై వచ్చే భారీ యాక్షన్ సీన్లను అన్బరివ్ మాస్టర్స్ ప్రత్యేకంగా కొరియోగ్రఫీ చేయనున్నారట. సాధారణంగా రూరల్ బ్యాక్‌డ్రాప్ కలిగిన సినిమాల్లో ఉండే రొటీన్ ఫైట్స్‌లా కాకుండా.. 'సెయాన్' మూవీలోని యాక్షన్ సీన్స్ చాలా వినూత్నంగా, డిఫరెంట్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఒక విలేజ్ మూవీకి సరికొత్త కాన్సెప్ట్, అత్యంత గ్రాండ్ స్కేల్‌లో మాస్ అండ్ రియలిస్టిక్ ట్రీట్‌మెంట్ ఇస్తూ ఈ సీక్వెన్సులను ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. అన్బరివ్ మాస్టర్స్ మేకింగ్ లో రాబోతున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ సీన్స్ థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని సమాచారం. ఇక ఈ బిగ్ అప్‌డేట్‌తో శివకార్తికేయన్ ఫ్యాన్స్‌లో 'సెయాన్' సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.



## నేను సమర్థురాలిని కాను..అందుకే

# వాటికి దూరంగా ఉంటా..

### నయనతార

లేడీ సూపర్ స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న నయనతార.. ప్రజెంట్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ గోల్డెన్ ఆఫర్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. ఈ క్రమంలోనే నయన్ నుంచి వస్తున్న వరుస చిత్రాల్లో 'టాక్సిక్' ఒకటి. ఈ సినిమా ట్రైలర్ ఈ రోజు రిలీజ్ కావడంతో.. ఈవెంట్‌లో సందడి చేశారు నటీమణులు. అయితే.. నయనతార ఏ సినిమాలో నటించిన ప్రమోషన్స్‌కు మాత్రం పెద్దగా హాజరవ్వరు.

అదే విషయంపై ఈ ట్రైలర్ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. 'ప్రచార కార్యక్రమాలకు హాజరవ్వడం నాకు ఇష్టం లేదని కాదు.. కాకపోతే ఆ విషయంలో నేను అంత సమర్థురాలిని కాను.. అందుకే వాటికి దూరంగా ఉంటాను.. అయితే.. టాక్సిక్ సినిమా చాలా ప్రత్యేకమైనది కావడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా యశ్ విషయం వస్తే.. అతను ఒక్క ఫోన్ కాల్ చేయడమే నేను ఆ కార్యక్రమానికి హాజరవ్వడానికి సరిపోయింది' అంటూ చెప్పుకొచ్చింది. కేవలం యశ్ కాల్ చేసి రమ్మని చెప్పడంతోనే తాను ఈ ట్రైలర్ ఈవెంట్‌కు వచ్చినట్లు నయన్ చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా.. యశ్ ప్రధాన పాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' మూవీ భారీ అంచనాల మధ్య ఆగస్టు 26 ప్రేక్షకుల ముందు రానుంది. ఈ క్రమంలోనే నేడు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్నారు మేకర్స్. ఇందులో నయనతార 'గంగా' అనే పాత్రలో కనిపించనుంది.



## టాక్సిక్ తర్వాత ప్రేక్షకులు నన్ను

# ఆ విధంగా చూస్తారు..

## ట్రైలర్ ఈవెంట్‌లో కియారా అద్వానీ

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా వస్తోన్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టాక్సిక్'. ఇందులో కియారా అద్వానీ నదియాగా, గంగా పాత్రలో నయనతార, మెల్లిసాగా రుక్మిణి వసంత్, ఎలిజబెత్‌గా హుమాఖురేషి, రెబెక్కాగా తారాసుతారియా నటిస్తున్నారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఆగస్టు 26న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. రిలీజ్ సమయం దగ్గర పడుతున్న క్రమంలో తాజాగా ఈ మూవీ నుంచి ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ట్రైలర్ ఈవెంట్‌లో కియారా అద్వానీ తన పాత్ర విశేషాలు పంచుకుంది.

'నేను నిజంగా ఒక విషయాన్ని మాత్రం గట్టిగా నమ్ముతున్నాను. నన్ను ఈ సినిమాలో నదియాగా గీతూ అండ్ యశ్ తీర్చిదిద్దారు. ఇందులో నా పాత్రను చూపించిన విధానం.. ఎంత సమర్థవంతగా ఉందంటే నేను నమ్మలేకపోతున్నా. నేను నిజంగా ఒక యాక్టర్ అని ఇందులో నా పాత్ర చూసిన తర్వాతే అనిపించింది. ఇప్పుడు రిలీజ్ చేసిన ట్రైలర్ చూస్తుంటే.. ఇందులో ప్రతి చిన్న బిట్ కూడా మెస్మరైజింగ్‌గా ఉంది. దీనికి నేను ఒక్కటే చెప్పగలుగుతున్నా డైరెక్టర్ గీతు, అండ్ యశ్ థాంక్యూ సో మచ్. నన్ను కూడా ఈ సినిమాలో ఒక పార్ట్ చేశారు. ఒక యాక్టర్‌గా నా జీవితంలో ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్. నాకు తెలిసి టాక్సిక్ సినిమా రిలీజ్ అయిన తర్వాత.. టాక్సిక్ బిఫోర్ కియారా, టాక్సిక్ ఆఫ్టర్ కియారా అంటారు. ఈ సినిమాలో ప్రతి ఒక్కరి పాత్రను అంతే సమర్థవంతంగా తీర్చిదిద్దారు. అందరికి ఈ సినిమా మంచి సక్సెస్ ఇస్తుంది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది కియారా.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090